నమ్మలేని నిజాలు

ప్రకృతి విలాపం
వికృతి అట్టహాసం
జనం గగ్గోలు.

భూగర్భగోస
పచ్చదనం గాలికి
కడుపు కాలి.

వికృతి నవ్వు
భూ అఖాతంలో జనం
మానవ లోపం.

జనాభివృద్ధి
పుడమి ఉన్నంతనే
రాక్షస కన్ను.

పైసల చెట్టు
పేదకందితే ఒట్టు
లోతైన గుట్టు.

– రేడియమ్
సెల్: 9291527757




# నేటినిజం


తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com


శ్రీనిజాలు

ఇకపై టెన్నిస్ ఆటకు
గుడ్ బై చెప్పె సానియా !
ఇలాంటి దిగ్గజం మరల
పొందగలదా ఇండియా ?

ఎల్బీ స్టేడియం లోనె
మొదలై, ఆడె చివరాట !
చెప్పె కుటుంబ సభ్యులకు
అభిమానులకిక టాటా !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245




హైదరాబాద్ గురువారం 9-3-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 165 పేజీలు:6 వెల: రూ.1/-


## ఉచిత మెగా క్యాన్సర్ శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్

వరంగల్ , మార్చి 8: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పర్వతగిరి మండలం ఏనుగల్ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత మెగా క్యాన్సర్ శిబిరాన్ని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు , ఎంపీ పసునూరి దయాకర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట్ర ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్, ఓఒఅ బస్వరాజు సారయ్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ఓఖూ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, వర్ధన్నపేట శాసనసభ్యులు ఆరూరి రమేష్, పరకాల శాసనసభ్యులు చల్లా ధర్మా రెడ్డి, నర్సంపేట శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి, తూర్పు శాసనసభ్యులు నన్నపునేని నరేందర్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి కేటీఆర్ కి మంత్రి ఎర్రబెల్లి ఘన స్వాగతం పలికారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు..

అమరావతి, మార్చి 8:జాతీయ రహదారి రాప్తాడు మండలం హంపాపురం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు. హిందూపురం మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు డిగ్రీ పరీక్షలు రాసేందుకు వెళుండగా ద్విచక్ర వాహనం పంచర్ కావడం రోడ్డు ప్రమాద ఘటన చోటు చేసుకుంది. గాయపడిన వారు అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల పేరు ఊరు వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## మహిళా వ్యాపారులకు సింగిల్ విండో విధానం అమలు చేస్తాం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 8:తెలంగాణ రాష్ట్రంలోమహిళా వ్యాపారులకు సింగిల్ విండో విధానం అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆంస్పష్టం చేశారు. హోటల్ తాజ్ కృషావేదికగా వీ హబ5వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

వీ హబ్ ప్రతినిధులకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. రూ. 1.30 కోట్లు ఇస్తే వీ హబ్ నుంచి ఒక స్టార్టప్తో రూ. 70 కోట్లకు పెంచారు. స్త్రీ నిధి కింద మహిళలకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రూ. 750 కోట్లు వడ్డీ లేని రుణాలు విడుదల



చేస్తున్నామని చెప్పారు. యువత ఎందుకు వ్యాపారవేత్తలు అవ్వకూడదు..? అని ప్రశ్నించారు. ప్రతీ పారిశ్రామిక పార్కులో 10 శాతం ప్లాట్స్ మహిళలకు కేటాయించామని తెలిపారు. ప్రతీ మూడు కోవిడ్ టీకాల్లో రెండు హైదరాబాద్ నుంచే వచ్చాయని కేటీఆర్ గుర్తు చేశారు.

స్త్రీ, పురుషులకు సమానంగానే ప్రతిభ ఉంటుంది అని కేటీఆర్ తెలిపారు. మానవ వనరులు, సాంకేతికతను వినియోగించుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. అమ్మాయిలు వ్యాపార రంగంలో రాణించాలి. ప్రతి తల్లిదండ్రులు అమ్మాయిలకు ఇష్టమైన చదువును చదివించాలి. వారి ఫెయిల్యూర్ అయినా కూడా తల్లిదండ్రులు.. వెన్నుతట్టి ప్రోత్సహించాలి. అప్పుడే అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించగలుగుతారు అని కేటీఆర్ తెలిపారు.

ప్రస్తుతం చాలా మంది అనాగరికులుగా ఉన్నారని కేటీఆర్ అన్నారు. మన పిల్లలకు చిన్నప్పట్నుంచే విలువలు నేర్పించాలి. తల్లిదండ్రుల వ్యవహారశైలి పిల్లలపై ప్రభావం చూపుతుంది. మన పిల్లల్ని ఎలా పెంచుతామనేది ప్రధానం అని చెప్పారు. తల్లిదండ్రులు అమ్మాయిలు, అబ్బాయిల మధ్య వివక్ష చూపించరాదు. సమానంగా చూడటం మన ఇంటి నుంచే ప్రారంభిస్తే.. వారు కూడా ఇతర అమ్మాయిల్ని, అబ్బాయిల్ని సమానంగా, గౌరవంగా చూస్తారని కేటీఆర్ తెలిపారు.

## ఆరోగ్య మహిళ.. ఆడ బిడ్డకు వరం : మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం, మార్చి 8: (నేటినిజం ప్రతినిధి): ఆరోగ్య మహిళ పథకం మహిళలకు వరంలాంటిదని, మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా మరో గొప్ప వరాన్ని అందించిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఆరోగ్య మహిళ అనే మంచి కార్యక్రమాన్ని రూపొందించిందని మంత్రి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మహిళల ఆరోగ్యంకై మెరుగైన పరీక్షల కోసం రేడియాలజీ యూనిట్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ కార్యక్ర మంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు 57 రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా ఇస్తారన్నారు.

అవసరమైతే ఇతర దవాఖానలకు రెఫర్ చేస్తారన్నారు.

పరీక్షల అనంతరం ఆరోగ్య మహిళ యాప్లో వివరాలు నమోదు చేసి ప్రతి పేషంట్కు తన ఆరోగ్య పరిస్థితి, వైద్యం వివరాలతో కూడిన కేస్ షీట్ అందజేసి పరీక్షలు పూర్తయ్యాక మెరుగైన వైద్యసేవలు అవసరమని భావిస్తే ఇతర దవాఖానలకు రిఫర్ చేసే అవకాశం ఉందన్నారు. అక్కడ వారికి మెరుగైన వైద్య సాయం అందిస్తారన్నారు.

మెరుగైన సేవలతో విశేష ఆదరణ ప్రభుత్వ దవాఖానలు సరికొత్తగా మారాయని, స్వరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్కు దీటుగా వసతులు కల్పించింది. మెరుగైన వైద్యసేవలు అందిస్తుండడం, నాణ్యమైన మందులు అందిస్తుండడంతోనే ప్రజాదరణ పెరుగుతున్నదన్నారు.

## ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు : మంత్రి హరీష్ రావు

కరీంనగర్ లో మంత్రి గంగుల కమలాకర్ తో కలిసి మంత్రి హరీష్ రావు మహిళ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక మంచి కార్యక్రమం మన కరీంనగర్ లో ప్రారంభించుకున్నామన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మహిళా అనే కార్యక్రమం ప్రారంభించుకున్నామన్నారు. ఇక్క 8 రకాల వ్యాధులకు సంబందించిన ట్రీట్ మెంట్ తీసుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదట 100 ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని,

రానున్న రోజుల్లో వీటి సంఖ్య పెంచుతామన్నారు. ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తానన్నారు. పెద్దపెద్ద ఆసుపత్రుల్లో అందె అన్ని చికిత్సలు ఇక్కడ లభిస్తాయన్నారు.

## ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆరోగ్య మహిళ పథకం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, మార్చి 8: రాష్ట్రంలోని మహిళల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశంలో రాష్ట్రంలోని వైద్యరంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, దీంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగిందన్నారు. నిర్మల్ పట్టణంలోని ఎంసీఎచ్లో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రసూతి వార్డులో పలువురికి కేసీఆర్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆరోగ్య మహిళ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమం అమలు కానుందని చెప్పారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున పీహెచ్సీలు, యూపీహెచ్సీలు, బస్తీ దవాఖానాల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొనారు. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా 'ఉమెన్ క్లినిక్'లు నిర్వహిస్తారని, మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే 8 రకాల ఆరోగ్య సమస్యలకు ఇక్కడ వైద్యం అందించనున్నారని వెల్లడించారు.

# నమోస్తు నారీ!

**యత్ర నార్యస్తు పూజ్యంతే,**
**రమంతే తత్ర దేవతాః**

ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారు, అంటోంది మన సంస్కృతి. త్రిమూర్తులకు మూలమైన ఆదిపరాశక్తి స్త్రీ. ప్రకృతిని స్త్రీరూపంగా చెప్పాయి వేదాలు. మాతృదేవోభవ అని తల్లిని ప్రత్యక్ష దైవంగా పూజించమన్నారు ఋషులు. ఋగ్వేదంలోని దేవీ సూక్తం, స్త్రీని విశ్వశక్తిగా చెప్పింది. మన ఉపనిషత్తు ఉపనిషతులు, శాస్త్రాలు... స్త్రీని సాధికారత కలిగిన స్వరూపంగా పేర్కొన్నాయి. ఋగ్వేదం స్త్రీ ఔన్నత్యాన్ని ప్రశంసించింది. 'నేను మహారాణిని, సంపదను సేకరిస్తాను, ఆలోచిస్తాను, తొలి వందనం స్వీకరిస్తాను, అందువల్లే భగవంతుడు నన్ను ప్రతి ఇంట్లోను నెలకొల్పాడు. నా కారణంగానే ఇంటిల్లిపాదీ ఆహారం తీసుకుంటారు, గాలి పీలుస్తారు, వింటారు, మాట్లాడతారు' అంటుంది స్త్రీ. దేవీ సూక్తం స్త్రీని అగ్రస్థానాన నిలబెట్టింది. బ్రహ్మమానసపుత్రికే దేవి అని, ఆమె నుంచే ప్రకృతి, పురుషుడు ఉద్భవించారని చెబుతోంది. పంచభూతాలలో నీరు, భూమి ఈ రెండింటినీ స్త్రీ స్వరూపంగానే భావించి, భూమాత, నదీ మాత అని వారిని గౌరవంగా, ఆప్యాయంగా పిలుచుకున్నారు. భారతీయ సంప్రదాయం స్త్రీకి పెద్దపీట వేసి గౌరవించింది. స్త్రీలు వేదాలు చదవాలని చెప్పింది.

> దేశవ్యాప్తంగా భారత దేశంలో ఏదోఒకచోట మహిళలపై దారుణ మారణ కాండలు చెలరేగుతూనే ఉన్నాయి. మొన్నటి సంఘటన కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన వైద్య విద్యార్థిని డాక్టర్ డి. ప్రీతి ఆత్మహత్య సంఘటన.

### ప్రాచీన భారతంలో మహిళ :

అధ్యయనాల ప్రకారం వేదకాలపు ఆరంభంలో మహిళలు సమాన హోదా, హక్కులను అనుభవించేవారు. ఏమైనా తరువాత (సుమారుగా 500 బి.సి.) స్మృతులతో, మహిళల హోదా తగ్గడం మొదలయ్యింది (ముఖ్యంగా. మనుస్మృతి) ఆధారంగా. బాబర్ వంటి ఇస్లాం రాజుల ఆక్రమణలు, మొఘల్ సామ్రాజ్యం తరువాత క్రైస్తవ మతం మొదలైనవి మహిళల స్వేచ్ఛను, హక్కులను హరించాయి. జైన మతం వంటి విప్లవాత్మక ఉద్యమాలు మహిళలను మతపరమైన కార్యక్రమాలకి అనుమతించినప్పటికీ, మహిళలు ఎక్కువగా నిర్బంధాన్ని, ఆంక్షలనూ ఎదుర్కొన్నారు. బాల్యవివాహ సంప్రదాయం సుమారుగా ఆరవ శతాబ్దంలో ప్రారంభమయి ఉంటుందని భావిస్తున్నారు. ముదిత అనగా స్త్రీ. ముదితల్ నేర్వగా రాని విద్య కలదే ముద్దర నేర్పించినన్ ఎక్కడయితే స్త్రీలు గౌరవించబడతారో ఆ దేశం సస్యశ్యామలంగా వుంటుందని ఆర్యోక్తి. ఒక కవి స్త్రీ గురించి ఇలా రాసాడు బ్రతుకు ముల్లబాటలోన్ జతగా స్నేహితురాలవయ్యివి ....కన్నీళ్ళు తుడిచే వేళ తోడబుట్టిన చెల్లెలైతివి....వెనక ముందు రాలినప్పుడు వెన్నుతట్టిన భార్యవైతివి....పురిటి నొప్పుల బాధ తెలియని పురుష జాతికి తల్లివైతివి.....అని అన్నారు. కష్టంలో ముందుండి.... విజయంలో వెనకుండి ....ఎల్లప్పుడు పక్కనుండేదే స్త్రీ. స్త్రీని పూర్వ కాలంలో అబల అనగా బలం లేనిది అనేవారు. పూర్వం స్త్రీలు ఇంటి పట్టున ఉండి ఇంటి పనులు చేసుకొనేవారు. వివాహితలు ఇంటిని చక్కదిద్దుకుంటూ భర్త, పిల్లల యొక్క బాగోగులు చూసుకొనేవారు. ఆ విధంగా గృహిణి పాత్ర నూటికి నూరు శాతం నిర్వహించేది. రాజ్యంలో యుద్ధానికి వెళ్ళే పరిస్థితుల్లో పురుషులను తల్లీ లేదా భార్య కుంకుమ దిద్ది సమాయత్తపరిచేవారు. తదనంతరం కాలం, స్త్రీలు బయటకు వచ్చి పురుషులతో సమానంగా చదువుతూ, ఉద్యోగాలు చేస్తూ, పరిమితమైన విజయాల్ని మాత్రమే దక్కించుకుంటున్న నేపథ్యంలో, 1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు పురుషులతో సమానంగా వేతనం, పనిగంటలు ఇంకా ఇతరత్ర హక్కుల కోసం తీవ్ర పోరాటంలో భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లను అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. 1909 ఫిబ్రవరి 28న అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ ఈ రోజును ప్రతిపాదించారు. రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండిస్తూ. దీని ప్రాముఖ్యతను చూసి ముగ్ధులయిన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. 1910 సంవత్సరంలో సోషలిస్ట్ ఇంటర్నేషనల్ యొక్క కోపెన్ హాగన్ సమావేశంలో మహిళా దినోత్సవానికి అంతర్జాతీయ హోదా లభించింది. ఆ సమయంలో మహిళలందరికీ ఓటు హక్కు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. సమాజంలో దేశ అభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు కూడా సహాయపడుతున్నారు. అయినప్పటికీ చాలా దేశాల్లో మగవారితో సమానమైన గౌరవం, అవకాశాలు స్త్రీలకు లభించడం లేదు. కొన్ని దేశాల్లో మహిళలు కుటుంబం అనే నాలుగు గోడల మధ్యే నలిగిపోతున్నారు. మహిళలను చాలా దేశాలు క్రీడా, రాజకీయాల, రక్షణ మంత్రిత్వ శాఖ, సైనిక రంగాలలో ప్రోత్సహించడానికి సహాయ సహకారాలు చేస్తున్నారు. ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కుల గురించి మహిళలకు అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని ప్రతి ఏడాది మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1909 సంవత్సరం నుంచి మహిళ దినోత్సవం జరుపుకోవడం ప్రారంభమైంది. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే మహిళ దినోత్సవానికి సంబంధించిన చరిత్ర, ప్రాముఖ్యత, థీమ్ ఏమిటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

### తొలిసారిగా మహిళా దినోత్సవం..

నిజానికి, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొట్టమొదటిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1913లో రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజును అధికారికి సెలవు రోజుగా ప్రకటించారు. 1917 లో ఫిబ్రవరి విప్లవం ఆ నెల చివరి ఆదివారం సెయింట్ పీటర్స్ బర్గ్లో మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మొదలయ్యింది. (గ్రెగోరియన్ కాలెండరు ప్రకారం ఆ తారీఖు మార్చి 8 ఆ రోజు మొదటి ప్రపంచ యుద్ధం, రష్యాలోని ఆహార కొరత ముగిసిపోవాలని నినదించారు. దీన్నే 'బ్రెడ్డు, శాంతి' డిమాండుగా వ్యవహరిం చారు. లియోన్ ట్రోస్కీ ప్రకారం, 'ఆ రోజే ఒక విప్లవానికి పునాదులు పడతాయని ఎవరూ ఊహించలేదు. వస్త్ర పరిశ్రమల్లోని మహిళా శ్రామికులందరూ అధికారులను ఖాతరు చేయకుండా విధులు బహిష్కరించి వీధుల్లో పడ్డారు. అవే విప్లవానికి తొలి అడుగులు మరోవైపు 1917 యుద్ధం వేళ రష్యాలోని మహిళలు ఆహారం–శాంతి కోసం డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. నాలుగు రోజుల తర్వాత అప్పటి రష్యా రాజు నికోలస్ జార్ సింహాసనాన్ని వీడారు. అప్పుడు తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఓటు వేసే హక్కును ఇచ్చింది. మార్చి 8న. మహిళలు సమ్మెకు దిగిన రోజు జూలియన్ క్యాలెండర్ ప్రకారం, ఫిబ్రవరి 23వ తేదీ ఆదివారం. కానీ గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది మార్చి 8వ తేదీన వచ్చింది. అందుకే ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పటికి, 1975వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తించింది. స్త్రీ, పురుషులకు సమాన హక్కుల కోసం పోరాడే వారికి ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం చక్కని వేదిక అని చెప్పొచ్చు. ఈరోజున మహిళలు తమ హక్కుల కోసం ఎంతలా పోరాటం చేశారో.. వారికి ఇంకా అవసరమైన వాటి కోసం గళమెత్తడం, అడ్డంకులను అధిగమించడం, ఒక శతాబ్దానికి పైగా చరిత్రలో వీరికి పెరుగుతున్న బలాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహించి, సంబరాలు ప్రారంభించింది. తదనంతరం, ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మహాసభ ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులను కాపాడేందుకు , ప్రపంచవ్యాప్తంగా మహిళలు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. దీని తర్వాత ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా కొత్త థీమ్ను ప్రవేశపెడుతుంది. మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడడమే కాకుండా, లింగ ఆధారిత భేదాలు, సమానత్వ లక్ష్యం, మహిళల హక్కులు మొదలైన వాటి గురించి కూడా ఈ రోజున అవగాహన కల్పిస్తారు. సంక్షేమంపై దృష్టిసారించిన వివిధ మహిళా సంఘాలు మహిళలకు ఆధునిక కాలంలో ఆడది అబల కాదు 'సబల' అనగా పురుషులతో సమాన స్థాయికి చేరుకోగలదు అని నిరూపించుకుంటున్నారు. నేటి స్త్రీ ఉద్యోగాల వల్ల ఎంతో ఒత్తిడి ఎదుర్కొంటోంది. అయితే స్త్రీ సాధికారత వల్ల గృహిణి పాత్ర మాత్రం కాస్త తక్కువైందని, పిల్లలకు తల్లి శిక్షణ కొరవడిందని, స్త్రీ ఆర్థిక స్వేచ్ఛ దుర్వినియోగం వల్ల కుటుంబ వ్యవస్థ కాస్త బలహీన పడింది అని చెప్పవచ్చు. "కడుపులో బిడ్డ ఆడా.. మగా అని తెలుసుకోవడం లో మొదలయ్యే వివక్ష.. కష్టపడి.. గొడ్డు చాకిరీ చేసి.. తన జీవితమంతా పిల్లల కోసమే బతికి.. చివరకు కాళ్లు, చేతులు కదలలేని పరిస్థితుల్లో.. వృద్ధాశ్రమానికి చేరుకునే వరకు 'ఆమె' పై వివక్ష అలానే కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా భారత దేశంలో ఏదోఒకచోట మహిళలపై దారుణ మారణ కాండలు చెలరేగుతూనే ఉన్నాయి. మొన్నటి సంఘటన కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన వైద్య విద్యార్థిని డాక్టర్ డి. ప్రీతి ఆత్మహత్య సంఘటన.

> గతంలో ఎవరింట్లోనైనా ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందని సంబరపడిపోయేవారు. ఇప్పుడు ఆడపిల్ల పుడితే గుండెల మీద కుంపటిగా భావిస్తున్నారు. ఆడపిల్లలైతే చదువులు, కట్నాలు ఇచ్చి వివాహం చేయాలని అనంతరం ఏ సమస్య తలెత్తినా తామే పరిష్కరించాల్సి వస్తుందని తల్లిదండ్రులు భావించడంతో ఆడపిల్లల పై ప్రేమానురాగాలు తగ్గాయి.

### ఈ ఏడాది (థీమ్) :

ఈ రోజున మహిళల హక్కులను కాపాడేందుకు, ప్రపంచవ్యాప్తంగా మహిళలు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. దీని తర్వాత ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా కొత్త థీమ్ను ప్రవేశపెడుతుంది. మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడడమే కాకుండా, లింగ ఆధారిత భేదాలు, సమానత్వ లక్ష్యం, మహిళల హక్కులు మొదలైన వాటి గురించి కూడా మహిళా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సరం థీమ్ 'బుక్స్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ'. ఈ రోజు మహిళలు, బాలికల జీవన నాణ్యతను, ప్రయోజనాల కోసం ఉద్దేశించబడింది. కనుక ఆ దిశగా మహిళలు, బాలికల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాలు నిర్వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### ప్రపంచ వ్యాప్తంగా స్ఫూర్తిదాయకమైన కథనాలు :

భారతదేశంలో, గ్రామీణ మహిళలు వ్యవస్థాపకతలో శిక్షణ పొందుతున్నారు. వారి కమ్యూనిటీలలో క్లీన్–ఎనర్జీ ప్రాజెక్ట్లను మార్కెటింగ్ చేసే సామర్థ్యాన్ని పెంచుతున్నారు. ఇది స్వచ్ఛమైన శక్తిని ప్రోత్సహిస్తుంది. మహిళలకు ఉపయోగకరమైన వ్యాపార నైపుణ్యాలను నేర్పుతుంది, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. మొరాకోలో, మహిళల నేతృత్వంలోని సంస్థ నిరంతర నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతంలో అనుసరణ చర్యగా పొగమంచు నుండి నీటిని సేకరిస్తోంది. శీతోష్ణస్థితి ప్రభావాలకు ఇది ఒక వినూత్న పరిష్కారం, ఇది క్లిష్టమైన అవసరమైన చోట నీటిని పంపిణీ చేస్తుంది. నేపాల్లో, కంపెనీలు, ప్రభుత్వాలు మరియు వ్యక్తులు మహిళలకు సామాజిక, ఆర్థిక సాధికారతను ఎలా అందించగలరో ఒక ప్రత్యేకమైన ధృవీకరణ పథకం, ఇది మహిళా సాధికారతతో వాతావరణ చర్యను మిళితం చేసే 'రివార్డ్' ప్రాజెక్ట్ల కారణంగా మహిళల్లో పెట్టుబడులను వేగవంతం చేస్తోంది. అలా చేయడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో మహిళల కీలక పాత్రను గుర్తించి, విలువనిస్తుంది. ఉగాండాలో, మహిళల నేతృత్వంలోని సమూహాల సంఘం నిధుల సమూహాన్ని రూపొందించడానికి వారానికి ఒకసారి కనీసం వ్యక్తిగత–పొదుపులను సేకరిస్తుంది, దాని నుండి మహిళలు రుణాలు తీసుకొని వాతావరణ మార్పులను పరిష్కరించే ఆదాయ–ఉత్పత్తి కార్యకలాపాలలో పెట్టుబడి పెడతారు. ఈ చొరవ మహిళలు భూమి ప్రణాళిక, వ్యవసాయ–అటవీ, నేల పరిరక్షణ పద్ధతులను చేపట్టడానికి, శక్తిని ఆదా చేసే స్టవ్లను ఉపయోగించుకునే శక్తిని కూడా అందిస్తుంది. మర్రకేచ్లో, మహిళలు 3 సంవత్సరాల పని కార్యక్రమానికి దేశాలు అంగీకరించాయి, ఇది సవాళ్లు, పురోగతిని అడ్డుకునే 'అంటుకునే' సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది, అంటే ఎక్కువ మంది మహిళలు నాయకత్వం వహిస్తున్నట్లు నిర్ధారించుకోవడం, పరిష్కారాలు, వాతావరణ విధానాలపై నిర్ణయం తీసుకోవడం వంటివి. వాతావరణ మార్పులను పరిష్కరించడంలో పాలుపంచుకున్న విధాన రంగాల్లో వ్యవసాయం నుండి పట్టణ అవస్థాపన వరకు కొత్తపని ప్రపంచం వ్యాప్తంగా, వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్వర్క్ కన్వెన్షన్ ఆధ్వర్యంలోని జెండర్ వర్క్ ప్రోగ్రామ్, కార్యాచరణ ప్రణాళిక లింగ సమానత్వం, సాధికారతను పెంపొందించే దిశగా నిజమైన పురోగతిని నడిపించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

### భారతీయ మహిళలు :

కొన్ని సహస్రాబ్దులుగా భారతదేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనౌతూ వచ్చింది. ప్రాచీన కాలంలో పురుషులతో సమాన స్థాయి కలిగివున్న భారతీయ మహిళలు మధ్యయుగంలో అధమ స్థాయికి అణచబడటం, అనేకమంది సంఘ సంస్కర్తలు తిరిగి వారికి సమాన హక్కుల కల్పన కోస ం కృషి చేయడం, ఇలా భారతదేశంలో మహిళల చరిత్ర అనేక సంఘటనల సమాహారంగా ఉంది. ఆధునిక భారతదేశంలో మహిళలు దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్సభ సభాపతి, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారు. భారతదేశపు ఇటీవలి రాష్ట్రపతి కూడా ఒక మహిళ గౌరవనీయులైన శ్రీమతి ద్రౌపది ముర్ము వీరు భారతదేశానికి మహిళ రెండవ రాష్ట్రపతిగా సేవలం దించడం మహిళాలోకానికి ఆదర్శం, గర్వకారణం.

### కళలు, వినోద రంగం :

ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి, గంగుబాయి హంగల్, లతా మంగేష్కర్, ఆశా భోస్లే వంటి గాయనీమణులు, ఐశ్వర్య రాయ్ వంటి నటీమణులు భారతదేశంలో బాగా ప్రాచుర్యం ఉన్నవారు. అన్జోలియో ఇలా మీనన్ ప్రముఖ చిత్రకారిణి.

### క్రీడలు :

భారతదేశంలో సామాన్య క్రీడా దృశ్యం బాగాలేకపోయినప్పటికీ కొంతమంది భారతీయ మహిళలు ఈరంగంలో గుర్తించదగిన కార్యాలు సాధించారు. భారతదేశంలో ప్రముఖ క్రీడాకారిణులు పి.టి. ఉష, జే.జే. శోభ (అథ్లెటిక్స్), కుంజరాణి దేవి (వెయిట్ లిఫ్టింగ్), దయానా ఎడుల్జీ (క్రికెట్), సైనా నెహ్వాల్ (బాడ్మింటన్), కోనేరు హంపి (చెస్), సానియా మీర్జా (టెన్నిస్). కరణం మల్లీశ్వరి (వెయిట్ లిఫ్టర్) ఒలంపిక్ మెడల్ గెలిచిన ఏకైక భారతీయ మహిళ (2000లో కాంస్య పతకం).

### రాజకీయాలు :

పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా దాదాపు పది లక్షలకు పైగా మహిళలు భారతదేశంలో రాజకీయ జీవితం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్తో సహా బీహారు,మధ్య ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ప్రదేశ్ వంటి అనేక ఇతర రాష్ట్రాలు పంచయితీ రాజ్ సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు అమలు చేసాయి. 73వ, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానికంగా ఎన్నుకొనే విభాగాలన్నీ వాటి మూడవవంతు స్థానాలని మహిళల కోసం ఉంచుతారు. వివిధ స్థాయిల రాజకీయ కార్యక్రమాలలో మహిళల శాతం గుర్తించదగినంత పెరిగినప్పటికీ, పరిపాలన, విధాన నిర్ణాయక స్థాయిలలో ఇప్పటికీ మహిళలకు ప్రాతినిధ్యం పెద్దగా లేదు.

### సాహిత్యం :

చాలామంది ప్రముఖ మహిళా రచయితలు భారతీయ సాహిత్యంలో కవయిత్రులుగా, కథారచయితలుగా ఉన్నారు. సరోజినీ నాయుడు, కమల సూరయ్య, శోభా డే, అరుంధతి రాయ్, అనితా దేశాయ్ వారిలో కొందరు. సరోజినీ నాయుడుని నైటింగ్లే ఆఫ్ ఇండియా అంటారు. అరుంధతి రాయ్ తన నవల ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ కి గాను బుకర్ ప్రైజ్ మాన్ బుకర్ ప్రైజ్ని పొందారు.

### శాస్త్ర సాంకేతిక రంగాలు :

ఈ రంగాలలో కూడా అనేకమంది మహిళలు వెలుగొందుతున్నారు. కల్పనా చావ్లా, అంజు చధా, ఆషా మాథుర్, జితేందర్ కౌర్ అరోరా, అసీమా ఛటర్జీ, యమునా కృష్ణన్ వీరిలో కొందరు.

### స్థానిక సంస్థల్లో స్త్రీలకు 50 శాతం :

స్థానిక సంస్థల్లో యాభై శాతం స్థానాలు మహిళలకు కేటాయిస్తూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ రాజ్యాంగపరంగా స్థానిక సంస్థల్లో ఉన్న33 శాతం స్థానాలను యాభై శాతం వరకు పెంచే అధికారం రాష్ట్రాలకు ఉంది. ఛత్తీస్గఢ్, బీహార్, మహారాష్ట్ర రాష్ట్రాలు 33 శాతం కంటే ఎక్కువగా పెంచాయి. ప్రతి ముగ్గురు ఉద్యోగుల్లో ఒక మహిళ తప్పనిసరిగా ఉండే పరిస్థితులు రానున్నాయి.పురుషులతో పోలిస్తే మహిళలు ఆచితూచి అడుగువేస్తారు. విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉంటారు. దీర్ఘకాలిక ప్రయోజనాలపైనే ఎక్కువగా దృష్టిసారిస్తారు. ఏకాభిప్రాయసాధకులుగా, అందరినీ సమాధాన పరచగలిగే వారథులుగా మహిళలది ప్రత్యేక శైలి. అది వారికి జన్మతః వచ్చిన లక్షణం.

### తగ్గుతున్న స్త్రీల జనాభా :

మాతృస్వామ్యంలో అవతరించి పితృస్వామ్య వ్యవస్థకు మారింది దేశీయ సంస్కృతి. మహిళల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. పురుషాధిక్యత పెరుగుతోంది. గతంలో ఎవరింట్లోనైనా ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందని సంబరపడిపోయేవారు. ఇప్పుడు ఆడపిల్ల పుడితే గుండెల మీద కుంపటిగా భావిస్తున్నారు. ఆడపిల్లలైతే చదువులు, కట్నాలు ఇచ్చి వివాహం చేయాలని అనంతరం ఏ సమస్య తలెత్తినా తామే పరిష్కరించాల్సి వస్తుందని తల్లిదండ్రులు భావించడంతో ఆడపిల్లల పై ప్రేమానురాగాలు తగ్గాయి. ఇదే తరుణంలో మగపిల్లల పై మోజు పెరిగింది. విద్యాబుద్ధులు నేర్పిస్తే ఉద్యోగం చేసి తమను పోషిస్తాడని అంతేకాక లక్షలాది రూపాయల కట్నం తెస్తాడని, తమను పున్నామ నరకం నుండి రక్షిస్తాడని భావించారు. దీంతో తల్లి గర్భంలోనే పిండం ప్రాణం పోసుకుంటున్న దశలో స్కానింగ్లు తీయించి పాప అయితే గర్భవిచ్చిన్నం చేయించుతున్నారు. ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను క లిగి ఉన్న భారత్... స్త్రీ, పురుషులను సమానంగా చూసేవిషయంలో మాత్రం అట్టడుగున ఉందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూ ఈఎఫ్) రూపొందించిన సూచీ వెల్లడించింది. భారత్లో ఆడ శిశువులను గర్భంలోనే చంపేస్తున్నారని, 2.5 కోట్ల మంది ఆడపిల్లలు భూమ్మీదకు రాకముందే హత్యకు గు రయ్యారని నోబెల్ బహుమతి గ్ర హీత అమర్త్యసేన్ వెలిబుచ్చిన ఆందోళనలను ఇది నిర్ధారించింది. 134 దేశాలపై రూపొందించిన ఈ సూచిలో భారత్ 114వ స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలు సైతం ఈ సూచీలో భారత్ కంటే మెరుగైన స్థానంలో ఉన్నాయి.

### మహిళా దినోత్సవం లక్ష్యం:

ఈ రోజున మహిళల విజయాలను సెలబ్రేట్ చేసుకుంటారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమేననే భావనను ప్రచారం చేస్తున్నారు. మహిళా దినోత్సవం రోజున, మీ తల్లి, మీతో పుట్టిన సోదరీమణులు మీరు కలిసి ఉండే స్నేహితులను అభినందించడం మర్చిపోవద్దు. మీకు కావాలంటే, మీరు వారికి అవసరమైన బహుమతి వస్తువులను కొనుగోలు చేయవచ్చు. పురుషాధిక్య సమాజంలో నేటి మహిళ అబలగానే మిగిలిపోతోంది. ఏదీ మారదు.. అటు ఆడదానికి ఆడదే శత్రువున్నట్లు.. స్త్రీని వివక్షకు గురిచేస్తున్న వారిలో మహిళలు కూడా పురుషులకు సమానంగానే ఉంటున్నారు.. కొన్ని చోట్ల వాళ్లే ఎక్కువగా ఉంటున్నారు..! అసలు సిసలైన ఫెమినిజం చూసి ఏళ్లు దాటిపోయింది. కడుపులో బిడ్డ ఆడా.. మగా అని తెలుసుకోవడంలో మొదలయ్యే వివక్ష.. కష్టపడి.. గొడ్డు చాకిరీ చేసి.. తన జీవితమంతా పిల్లల కోసమే బతికి.. చివరకు కాళ్లు, చేతులు కదలలేని పరిస్థితుల్లో.. వృద్ధాశ్రమానికి చేరుకునే వరకు 'ఆమె'పై వివక్ష అలానే కొనసాగుతుంది. చివరకు కాటికి చేరుకునే సమయంలో కూడా ఏది మారదు. మార్చి 8న ప్రతీఏడాది

> ఆధునిక భారతదేశంలో మహిళలు దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్సభ సభాపతి, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారు. భారతదేశపు ఇటీవలి రాష్ట్రపతి కూడా ఒక మహిళ గౌరవనీయులైన శ్రీమతి ద్రౌపది ముర్ము వీరు భారతదేశానికి మహిళ రెండవ రాష్ట్రపతిగా సేవలందించడం మహిళాలోకానికి ఆదర్శం, గర్వకారణం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. మరీ దేశంలో సమస్యల మాటేంటి..? వాటిని ఎవరు పరిష్కరిస్తారు..? అంతర్జాతీయ మహిళా దినోత్సవం లింగ సమానత్వం, మహిళలు, బాలికల సాధికారత కోసం సాధించిన పురోగతిని జరుపుకోవడానికి మిగిలి ఉన్న సవాళ్లను ఎలా పరిష్కరించాలో ప్రతిబింబించే అవకాశాన్ని అందిస్తుంది. వాతావరణ మార్పుల ప్రాంతంలో, 2016 విధాన నివేదికలో వాతావరణ మార్పులను పరిష్కరించడానికి 190 దేశ జాతీయ ప్రణాళికలలో 64 మహిళలు లేదా లింగానికి సంబంధించిన ప్రస్తావనను కలిగి ఉన్నాయని వెల్లడించింది. జాతీయ, స్థానిక స్థాయిలో, మహిళలు 'గ్రహీతలు'గా మాత్రమే కాకుండా కీలకమైన వాటాదారులుగా పరిష్కార రూపకర్తలుగా కూడా అన్ని అంశాలలో చేర్చబడే మెరుగైన వాతావరణ విధాన అభివృద్ధి, అమలుకు సంబంధించిన ఉదాహరణలు కేస్ స్టడీస్ పెరుగుతున్నాయి. వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్వర్క్ కన్వెన్షన్ జరుపుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న లింగ అసమానతలను అధిగమిస్తూ, అన్ని దేశాలలో వాతావరణ చర్య యొక్క దీర్ఘకాలిక స్థిరత్వం, ప్రభావాన్ని నిర్ధారించడానికి కీలకమైన మార్పు ఏజెంట్లుగా మహిళలు బాలికల ప్రాముఖ్యతపై అవగాహన ఇప్పుడు దృఢంగా స్థిరపడింది. ఉదాహరణకు, వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్వర్క్ కన్వెన్షన్ మొమెంటం ఫర్ చేంజ్ చొరవ ద్వారా ఇది ప్రదర్శించబడింది, ఇది ప్రపంచాన్ని అత్యంత స్థితిస్థాపకంగా, తక్కువ–కార్బన్ భవిష్యత్తు వైపుకు తరలించే అపారమైన కార్యకలాపాలపై వెలుగునిస్తుంది. వాతావరణ మార్పు, విస్తృత ఆర్థిక, సామాజిక, పర్యావరణ సవాళ్లను పరిష్కరించే వినూత్న, పరివర్తన పరిష్కారాలను మొమెంటం ఫర్ చేంజ్ గుర్తిస్తుంది. ఈ చొరవ 6 ఫోకస్ ప్రాంతాలను లెక్కించింది: ప్లానెటరీ హెల్త్, క్లైమేట్ న్యూట్రల్ నౌ, క్లైమేట్ ఫ్రెండ్లీ ఇన్వెస్ట్మెంట్ కోసం ఫైనాన్సింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ, సొల్యూషన్స్, అర్బన్ పూర్, మహిళలు ఫలితాల కోసం. రెండోది, ఈ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, వాతావరణ మార్పులను పరిష్కరించడంలో మహిళల కీలక నాయకత్వాన్ని, భాగస్వామ్యాన్ని గుర్తిస్తుంది.

*(ఈ సమాచారం మీ అందరికోసం వికీపీడియా నుండి)*

*అందరికీ అంతర్జాతీయ మహిళా శు భాకాంక్షలు.*




–శారదా శృంగేరి
94902 61119

నేటినిజం

# సాహితీ కెరటాలు

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 9-3-2023

## నానీలు

ఊరు ఊరంతా
పాలాభిషేకాలు
వెలిశాదేమో
మరో స్వామీజీ!






ఊరి సరస్సులో
రాజకీయ మొసళ్ళు
ఓటరు గజరాజులూ
జాగ్రత్త.

-సోమేపల్లి వెంకటసుబ్బయ్య
9000004565

## ఘంటారావం

మూడుముళ్ళ ముచ్చటను
మరచిపోకు
మూన్నాళ్ళ ముచ్చటగా
ముగియనివ్వకు.

కన్నీళ్ళనెందుకు
కట్టడి చేస్తావు
మనసు మబ్బును
ఎంతసేపు మోస్తావు?

కుటుంబానికి మహిళ
కానరాని వేరు
వనితల దినోత్సవంలో
ఊరేగే తేరు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



పుస్తక సమీక్ష

# 'ఆఖరి మజిలీ' కథ

భర్త ప్రేమ ఆదరణ అండదండలు కరువైన స్త్రీ కి జీవన సమరం ఎంత కష్టమో దుర్భరమో అదే సమయంలో వన్నెతరగని వ్యక్తిత్వంతో ఎలా తన అస్తిత్వాన్ని కాపాడుకోవచ్చో, మనోనిబ్బరాన్ని నిలబెట్టుకోవచ్చో ప్రభావశీలంగా అతి మనోహరంగా అత్యంత స్ఫూర్తిదాయకంగా తెలియజేసిన ప్రముఖ రచయిత్రి వంజారి రోహిణి రచించిన 'ఆఖరి మజిలీ' కథ – ఒక అవలోకనం – ఒక హృదయ స్పందన.

నిస్సహాయ స్థితిలో ఏ అండా లేకుండా బ్రతుకు చౌరస్తాలో నిలబడిన స్త్రీలు ప్రతికూల పరిస్థితులను వ్యతిరేక స్థితిగతులను ఎదిరించి ప్రమిదల్లా వెలుగుతూ ఇతరులకు దారి చూపుతూ ప్రగతిశీల మార్గంలో ఎలా పయనించాలో తను రాసిన మానవీయ కథ ద్వారా తేటతెల్లంగా తెలియజేసిన రాసిన రోహిణి సర్వదా అభినందనీయులు. వారికి ముందుగా నా హృదయపూర్వక అభినందనలు సౌహార్ద శుభాకాంక్షలు .




సాంప్రదాయ కుటుంబంలో జన్మించినా అణువణువునా ప్రోదిపరచుకున్న అభ్యుదయ భావాలతో ఆదర్శవంతమైన జీవన సంవిధానాన్ని కలిగిన మహోన్నత మానవతా మూర్తి రోహిణి .. తన విశిష్టమైన ఆలోచనా విధానాన్ని వన్నెతరగని వ్యక్తిత్వాన్ని అసమాన సాధికారతను కాపాడుకుంటూ విభిన్నశైలిలో కథా వస్తువుని సేకరించి, స్వీకరించి దానికి సంపూర్ణ న్యాయం చేయడంలో నూటికి నూరుపాళ్లు కృతకృత్యులయ్యే అందెవేసిన చేయి రోహిణి.. **"మాటలు చూస్తే కోటలు దాటుతాయి కానీ కాళ్ళు మాత్రం గడప దాటవు'** అనే చందంగా కాకుండా తన ఆదర్శ భావాలను మనసా వాచా కర్మణా అనుసరించే అరుదైన రచయిత్రి రోహిణి.

వారి కథలలో ఎక్కువగా తనకు బాల్య వయసు నుండీ పరిచయమైన ప్రభావశీలమైన సజీవ పాత్రలే కదలాడుతుంటాయి.

ఇక కథా ప్రస్థానంలోకి ప్రవేశిస్తే రమాదేవి అనే మహిళ కేవలం పదిహేడేళ్ల ప్రాయంలోనే తల్లిదండ్రుల బలవంతం మీద వివాహితగా మారి శ్రీనయ్య అనబడే దుర్బలుడూ నికృష్టుడైన భర్తచేతిలో పడి కష్టాల కడలికి ఎదురీది ఆ తదుపరి మరో వ్యక్తితో సహజీవన బాంధవ్యం ఏర్పరుచుకుని కారణాంతరాల వలన అతనికి కూడా దూరమయి ఆ పిమ్మట తనను తీవ్రంగా ద్వేషించి అసహ్యం చుకున్న మరో స్త్రీ కారుణ్య సేవలో తరించి ఆమె అంతరంగాన్ని తెలుసుకొని ఆమె ఆప్యాయత అనురాగాలు గెలుచుకున్న ధీరోదాత్తురాలైన అతివ సజీవ జీవన సంఘటనల సమాహారం.

రమాదేవి చిన్నతనంలోనే వివాహమై భర్త శ్రీనయ్య ఇద్దరు పిల్లలు మామ అత్తలతో అణుకువతో జీవించే ఒక సాధారణ మహిళ.. శ్రీనయ్య వేశ్యాలోలుడై అవినీతి పరుడై దుర్వ్యసనాల పాలై వాటి కార్యకారణ సంబంధం వలన ఉద్యోగం నుండి తొలగించబడి తీవ్రమైన అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితం అయిన ఒక దురదృష్టవంతుడు. రమాదేవి భర్తకు సపర్యలు చేస్తూ బిడ్డల చదువు సంధ్యలు చూస్తూ వచ్చే అతి చిన్న సంపాదనతో గుట్టుగా కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. ఈ నేపథ్యంలో సొంతమామ తనపై లైంగిక వేదింపులు చేస్తుండటంతో భర్తకు అత్తకూ ఫిర్యాదుచేసినా కానీ వారి నుండి కనీస సహాయం సానుభూతి కరువయ్యి తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తూ ఉంటుంది. భర్త దుర్వ్యసనాల ప్రభావం కుటుంబ ఆర్థిక స్థితిగతులను తారుమారు చేసి అప్పులపాలై పిల్లల స్కూల్ ఫీజ్ కూడా కట్టలేని దుర్భర పరిస్థితుల్లో తప్పనిసరై భర్త ప్రోద్భలంతో అతని స్నేహితుడు ప్రసాద్ నుండి అప్పుకోసం ఆశ్రయించి తదనంతర పరిణామాలతో అతనికి దగ్గరవుతుంది.

రోజురోజుకి పరిస్థితులు దుర్భరంగా తయారవ్వడంతో తట్టుకోలేని రమాదేవి తన భర్త స్నేహితుడైన ప్రసాద్ తో ఇంట్లోనుండి వేరే ఊరు వెళ్లిపోయి అతనితో నూతన జీవితం ప్రారంభిస్తుంది. మొదటిలో ఎంతో అన్యోన్యంగా గడచిన వారి సహజీవనంలో అతడి తల్లి, చెల్లెలు ప్రవేశించడంతో కలతలు మొదలయ్యి చినికి చినికి గాలివాన అయినట్లు చివరికి తీవ్రరూపం దాలుస్తాయి. ఒకసారి అతడి తల్లి పట్టరాని కోపంతో రమాదేవిని దుర్భాషలాడుతూ అధిక రక్తపోటుతో అకస్మాత్తుగా విరుచుకుపడిపోతుంది. డాక్టర్ పరీక్షించి తీవ్రమైన పక్షవాతంగా నిర్ధారించి ఆమెను కంటికి రెప్పలా కాపాడుకోవాలని చెప్తాడు. ఆమెను అటువంటి దయనీయ స్థితిలో నిర్దాక్షిణ్యంగా వదలి ఆమె కుమార్తె, కుమారుడు వెళ్లిపోతే రమాదేవి ఆమెకు సొంత కుమార్తె కన్నా ఎక్కువగా అన్ని రకాల సపర్యలూ సేవలూ దగ్గరుండి చేసి ఆమె చాలావరకూ కోలుకోవడానికి దోహదపడుతుంది. ఏడు సంవత్సరాలు పాటు రమాదేవి సేవలు అందుకున్న ప్రసాద్ తల్లి ఐరావతమ్మ చివరకు ఆస్తి అంతా రమాదేవి పేరిట రాసి కాలం చేస్తుంది. ఆస్తిని దక్కించుకోవడం కోసం ప్రసాద్ అతని చెల్లెలు ఇరువురూ కలిసి రమాదేవిపై కోర్టుకు వెళ్తారు. కానీ న్యాయం రమాదేవి వైపే మొగ్గు చూపడంతో ఆస్తి ఆమె సొంతం కావడంతో కథకు ముగింపు దొరుకుతుంది. ఇదీ స్థూలంగా కథ.



"ప్రేమించడానికే సమయం చాలడం లేదు, ఇక ప్రత్యేకంగా ద్వేషించడానికి తావెక్కడ?" అంటుంది ప్రముఖ సూఫీ కవయిత్రి రూబియా. ఐర్లండుకు చెందిన ప్రఖ్యాత కవి, కథా, నాటక, నవలా రచయిత, ఆస్కార్‌వైల్డ్ కూడా ఈమాటే అంటాడు. కాని, ఆధునిక యుగంలో మనుష్యుల మధ్య ఆ ప్రేమ కరువైంది. ప్రేమించలేకపోవడం పెనుజాడ్యంగా మారింది. ప్రేమను పొంద లేకపోవడం నిత్యకృత్యమైంది. ఈ ప్రేమరాహిత్యాన్ని 'ఆఖరి మజిలీ" లో సూక్ష్మస్థాయిలో పరిశోధిస్తుంది రచయిత్రి. రాగద్వేషాలు లేని, ఏ సంకోచం లేని, సంకుచితంకాని ప్రేమ ఎందుకు సాధ్యపడటం లేదనే ప్రశ్న రమాదేవిని వెంటాడుతుంది. ప్రేమరాహిత్యం అనేది మనుషులలో పేరుకుపోయిన జాడ్యమనీ మానవాళిని వేధించే శాపమనీ కథలో అంతర్లీనంగా ప్రస్తావిస్తూ ముగిస్తారు రచయిత్రి.

ఇక రచయిత్రిది ఒక ప్రత్యేకమైన శైలి సున్నితమైన సంఘటనలను సునిశితమైన రీతిలో వర్ణించే తీరు నభూతో నభవిష్యతి. సంభాషణలు ఎక్కువగా నెల్లూరు ప్రాంత మాండలికం లో ఉంటాయి. అందుకు ఉదాహరణగా కథలో రాసిన సంఘటనలను ఒకటీ రెండూ ఉటంకిస్తాను.

"అరిచి రచ్చ చేయకు రమా.. నేనే..నీ మామను. మీ అత్తతో నాకు సుఖం లేదు" నీ మొగుడు ఇక నిన్ను సుఖపెట్టలేడు నా మాట విన్నావంటే నీకు అంతో ఇంతో స్వర్గం చూపిస్తా "ఒంట్లోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని బలంగా ఒక్క తోపు తోసాను. దూరంగా పోయి పడ్డాడు మామయ్య." దిమ్మెరపోయాను మొదటిసారి అతనిలో కొత్త మనిషిని చూసి పాత తలుపు ఇనుపరేకు బలంగా నుదిటికి తగిలినట్లుంది. . గుడ్డి వెలుతురులో నుదిటి మీది నుంచి నల్లటి పాములా దిగజారుతోంది నెత్తురు. '' అబ్బా..!చంపసావే ముండా.. నన్నే తోస్తావటే లంజికాన.. రోజు నువ్వు ఆ ప్రసాద్ గాడి దగ్గరికి ఎందుకు పోతావో నాకు తెలీకనా.."నుదుటికి చేయి అడ్డంగా పెట్టుకుని

"ఏం నేను ముసలాడినా ..వాడి మీద మోజు నీకు" ఏదేదో అంటున్నాడు. ఏవి వినిపించడంలేదు నాకు. విపరీతమైన షాక్ కి గురైనాను. ఎన్ని రోజులుగా తడిక సందులో నుంచి నా నగ్నదేహాన్ని చూస్తున్నాడో. తలచుకుంటేనే ఒంటిమీద విషపు పురుగు పాకినట్లు కంపరమెత్తింది".

"మా నాయనే కదా. నీ మీద ఆశ పడ్డాడు. ఒప్పుకుంటే నీదేం పోయింది. పెద్ద పతివ్రతలాగా మాట్లాడుతున్నావు. నిద్రని పాడుచేశావ్" అన్నాడు తాపీగా

మదపిచ్చి వల్ల సుఖరోగాలు తెచ్చుకున్నాడని ఇంతవరకు నా మొగుడిమీద కాస్త జాలి ఉండేది ఇప్పుడు అతని మాటలు విన్నాక అంతవరకూ ఉన్న జాలి పోయి అసహ్యం కలిగింది. మా మధ్య ఉన్న బంధం బాగా పలచబడి సున్నితమైన మమకారపు పోగు ఏ క్షణంలో అయినా విడిపోయేటట్లు ఉండింది ఇంతకాలం. అది ఈ రోజుతో పుటుక్కున తెగిపోయింది. అత్తమ్మకి చెప్తే అసలు నమ్మదు. ఇక ఆ ఇంట్లో నా అస్తిత్వం ఏమిటో నాకు అర్థం కాలేదు. ఇక ఇప్పుడు నా హృదయములో రగులుతున్న బడబాగ్ని నుంచి సేదదీర్చే ఓ చల్లటి ఓదార్పు , నా వేదనకు ఉపశమనమిచ్చే ఓ భుజం ఆసరా కావాలి నాకిప్పుడు. నాది అనుకున్న ఇల్లు పరాయిదైపోయింది ఈ క్షణం. ఈ ఇంట్లో ఉండడం మాత్రం ఇక దుర్భరం"

ఇటువంటి స్త్రీ సాధికారత పాత్రలను అనేకం సృష్టించి అద్భుత కథలను తెలుగు సాహితీ లోకానికి అందిస్తున్న రోహిణికి అభినందనలు. **ఈ నెల 12 వ తేదీన** ఉదయం పది గంటలకు హైదరాబద్ లోని రవీంద్ర భారతిలో ఆమె సంచలనాత్మక కథా సంపుటి "నల్ల సూరీడు కథలు" ఆవిష్కరణ సందర్భంగా శుభాకాంక్షలు..

ప్రతులకు: రోహిణి వంజారి
9000594630



- డా॥ జెల్ది విద్యాధర్
9490469606

## నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-9)

తుపాను ముగిసిన తర్వాత వర్షంలా
కన్నీళ్ళు ఆమెను అప్పుడప్పుడు
తడుపుతూనే ఉన్నాయి.

బతుకు కొనసాగేందుకు
జ్ఞాపకాల మరకలను శుభ్రం చేసుకోక తప్పదు !

మనకు జరిగిన చెడ్డ జ్ఞాపకం
మనల్ని పట్టి పీడిస్తుంది
మంచి జ్ఞాపకం
తనంతకు తాను మసకబారుతుంటుంది.

'దేవుడు మంచోడే...
అత్తమ్మను దూరం చేసినా
అతనికే ఆదెరువు చూపిచ్చి
బతుకు బండి సక్కగా నడిచేటట్లు చేసిండు.....'
అనుకున్నది సరయు.

పసిదాని తామరపూల పాదాలు
తంగేడు పూల దేహ కాంతి
గులాబిపూల బుగ్గలు

డిసెంబరు పూల నీలి కన్నులు
గునుగుపూల గౌనులో మెరిసి పోతుంటే,
అది 'బతుకమ్మ' లా కనిపిస్తున్నది.
జన్మంతా దీన్ని చూసుకుంటా
గడిపేయాలనిపిస్తది ఆమెకు.
మాట కంటే ముందు పాట పుట్టినట్లు
దాని ఆలాపనలు చెబుతుంటాయి
అందుకే నేమో అ ఆ ల కంటే ముందే
ఉ ఊ లు నేర్చుకున్నది
తాను చెప్పకుండానే తన ఉనికిని కనిపెట్టేస్తున్నది.

మాయలో నుండి వచ్చిన మనిషిలో
మాయికత తనంతకు తానే వచ్చి చేరుతుందేమో!
అమాయకత్వం ఉన్నంతవరకూ
మనిషి దేవుడే!
మాయికత తోనే కదా మనిషి
మనిషితనాన్ని కోల్పోతున్నాడు.

స్వార్థం పేరుకుపోతున్న కొద్దీ మృగంగా మారుతున్నాడు
రాక్షసత్వాన్ని ప్రయత్న పూర్వకంగా
పెంచుకుంటున్నాడు.

తన బిడ్డకు ఎప్పుడూ
ఏ మకిలమూ అంటుకోకూడదని
ఎప్పటికీ ముత్యంలా ఇట్లనే
మెరిసిపోతుండాలని



ఆ తల్లి మనసారా కోరుకున్నది...

తల్లులందరూ ఇంతేనేమో
ప్రపంచంలోని ప్రేమనంత తెచ్చి
బిడ్డలకిస్తారు
ప్రేమ గుడ్డిదని వాళ్లే నిరూపిస్తుంటారు
తల్లి ఉంటేనే కదా లోకం
తల్లికి మాత్రం ఎప్పుడూ ఏదో ఒక శోకం !
'లోకంలోని తల్లులందరూ
సల్లగుండాలె' కదా!



-దోరవేటి
సెల్:9866251679

## మట్టి పరిమళం

అన్ని పరిమళాలకు జన్మస్థలి మట్టి
తన పాట తనే పాడుకుంటుంది పచ్చని సుగంధాలతో
ఇవ్వడం తప్ప తీసుకోవడం తెలియని సేద్యకారి
పాఠం నేర్చుకోవాలంటే మట్టిలో పెరిగిన చెట్టు గురువు.



అమ్మ, నాన్నల ప్రేమ వాత్సల్యం మట్టి పరిమళాల సేద్యం
పాలు తాగి రొమ్ములు కోస్తానంటే మట్టిలో కలిపేంత ఆగ్రహం.

మబ్బులు చిట్టి ముత్యాలై రాలగానే చాలదు కోరిన పంటకు
కూరలో ఉప్పులా చెమట బలం కలిస్తే పసందు
మట్టిలో సేద్యమంటే మట్టి గుణం తెలిసి చేయాలి
అపుడే రైతుకు కడుపారా తృప్తి, కంటినిండా నిద్ర.

మట్టిలో పుట్టిన వాటితోనే బతుకుతూ
కాళ్లకు మట్టంటకుండా ఉండాలనుకోవడం
వేర్లను నరికేసి చెట్టు పెరగాలనుకోవడమే
కుమ్మరి మట్టి సారెపై పాత్రలు, చేస్తే జీవనచిత్రాలు
వాములో కాలితే మట్టి పరిమళ జీవన సేద్యం.

మట్టి భాష వినడానికి, కనడానికి, రచించడానికి
మట్టి మనసులను ఆలింగనం చేసుకోవాలి మనసారా
రెండాకుల మొక్కగా మొదలెట్టాలి బతుకు సూర్యనమస్కారంతో
గాలిలోని తేమ కంటే మనిషిలో తేమ కావాలి సంస్కారవంతం
మనిషిగా బతికి మమతలు పంచాలి,

పంటకు పట్టిన పురుగులా మట్టిని కలుషితం చేస్తే
జీవుల భవిష్యత్తుపై రెట్ట వేసినట్లే
మట్టి పరిమళ సేద్యం పచ్చగుండాలంటే
మట్టి దేవతను కన్న బిడ్డల్లా కాపాడుకోవాలి
కంటికి రెప్పలా చూసుకోవాలి



-కొమురవెల్లి అంజయ్య
9848005676

## ఆమె

పాపం ఆమెకు ఇప్పటికీ
పాత టైం టేబుల్ తప్పడం లేదు.
అయిదు పది నిమిషాలు కూడా
టైం టేబుల్ వెనకా ముందు కానీయని బతుకు.
మహిళా దినోత్సవాలు మహిళల
టైంటేబుల్ లో విరామం తెచ్చాయా?
ఆమె ఊడ్వడం, అలుకు చల్లడం,
ఇల్లు తుడవడం ఇప్పటికీ ఆడవారి
పనులుగానే ఉన్నాయా?
పాలు పిండడం, గిన్నెలు తోమడం,
వంటచేయడం, పిల్లలకు పాలివ్వడం
కడగడం పడుకో బెట్టడం,
అన్నీ సర్దడం మొదలైన పనులు
ఇంకా ఆడోల్ల పనులు గానే ఉన్నాయా?
ఈ దినచర్యలో టైం టేబుల్‌లో
మహిళాదినోత్సవాలతో
ఏమైనా మార్పు వచ్చినట్టేనా?
మొన్నటి దాకా కన పడ్డ
మహిళా ఉద్యమ నాయకులు
పని చేస్తున్నారా?
కను మరుగయ్యారా?
యువతరం యువతులు
మహిళా వాదం లో ఎదుగుతున్నట్టేనా?
మనమంతా ఉన్నాం అనే
ధైర్యం ఇవ్వ గలిగామా? మరి
డాక్టర్ ప్రీతి ఎందుకు చని పోయినట్టు ?
నీల్లు కావాలని ఆడోల్లే
బిందెలు కుండలతో ప్రదర్శన చేస్తుంటే వాల్ల
మొగోల్లంత ఏమైపోయినట్టు?
ఆ నీల్ల కోసం,
గ్యాస్ సిలిండర్ల కోసం
మహిళలే ప్రదర్శన చేయాలా?
మహిళా ఉద్యమం సన్నగిల్లిందా ?
వ్యక్తులు గా కొన సాగుతున్నారా?
ఎవరో బల్లిపలికినట్టు శాపం పెట్టినట్టు
నిజంగానే అస్తిత్వ ఉద్యమాలు
వర్గ కుల మహిళా ఉద్యమాలు లౌకికవాద ఉద్యమాలు
ఎక్కడికక్కడ విరిగి పోయి
ఆగిపోతున్నట్టేనా?
ఆమె బతుకులో
మార్పు వచ్చినట్టేనా?



– బి.ఎస్.రాములు
8331966987

## అస్తిత్వమే చుక్కాని

అంకెల్లో సగం
అవనిలో సగం
ఆత్మవిశ్వాసం అపారం
ఆత్మగౌరవం ఉన్నతం
అందుకే ఈ శుభదినం
ప్రతిఏటా మార్చి ఎనిమిది
మహిలో మహిళా దినోత్సవం
అమితోత్సాహంతో
శ్రామిక మహిళా శక్తి
చారిత్రక ఘట్టంగా
న్యూయార్క్ లో మొదలై
జర్మనీ మహిళ
క్లారా జెట్కిన్ స్ఫూర్తితో
ప్రపంచ దేశాలకు ప్రాకి
పలు దేశాలను కుదిపి
కరడు గట్టిన యాజమాన్య
శాసనాలను తిరిగి రాయించి
సంస్కరణలకు బాటలు వేసి
ఛాంధస భావాల అంతుచూసి
మహిళాభ్యుదయానికి నాంది
పలికిన తంతు తర్కం
అమోఘం
అది ఓ మహా అక్షరయాగం
మహిళా స్వావలంబన
సాధికారత , సమానత
పని ప్రదేశం అనుకూలత
పని వేళల కుదింపు
పురుషులతో సమానవేతనాలు
విద్య ఆరోగ్యం ఓటుహక్కు
మొదలగు నినాదాలతో
సాగిన వైనం అందరిచే
హర్షణీయం
అంతర్జాతీయ స్థాయిలో
ఐక్యరాజ్యసమితి చే
ప్రతిసంవత్సరం
సరికొత్త నేపథ్యంతో
సాగేతీరు శ్లాఘనీయం
కాని, ఇది ఉత్సవంగా
ఒక రోజు మాత్రమే కాక
నిజంగా నిజాయితీగా
మహిళల అవకాశాలు
అధికారాలు హక్కులు
వారికే వదిలి వారి
వెన్నంటి ఉండి ప్రోత్సహించి
వారి అభివృద్ధికి దోహదపడి
కుటుంబ వృద్ధి
సమాజాభివృద్ధి
దేశాభివృద్ధి
ప్రపంచాభివృద్ధీ గావించి
వారి అస్తిత్వం లేనిదే
ఏకార్యమైనా అస్థికల్లేని
ఆకారమే అవుతుందని
చుక్కాని లేని నావ
అవుతుందని
గ్రహించిన నాడే భువిలో
నిజమైన
మహిళా దినోత్సవం.



-సంధ్య సుత్రావె,
9177615967

## అంతర్జాతీయ మహిళాదినోత్సవం సాంకేతికలో లింగ సమానత్వం

నేటి ఆధునిక స్త్రీ పురుషునితో సమానంగా అన్ని రంగాలలో పోటీ పడుతున్నప్పటికీ ,చాలా దేశాల్లో స్త్రీలకు పురుషులతో సమానంగా అవకాశాలు ,గౌరవం లభించడం లేదు. స్త్రీలను ప్రోత్సహించడానికి వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం లేదా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం నిర్వహిస్తారు . ప్రారంభంలో వివిధ దేశాలలో మహిళా దినోత్సవం వేరువేరు తేదీలలో ఆచరించేవారు. రష్యాలో ఫిబ్రవరి చివరి ఆదివారం జరుపుకునేవారు .మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో మహిళలందరూ యుద్ధ కాలంలో ఆహార కొరత తగ్గించాలని, శాంతి నెలకొల్పాలని విప్లవాన్ని చేపట్టారు. ఆ హక్కుల పోరాటంతో రష్యా జార్ చక్రవర్తి జార్జ్ నికోలస్ రాజీనామా చేయాల్సి వచ్చింది. దీంతో రష్యా మహిళలకు ఓటు హక్కు లభించింది .ఇప్పుడు మనం ఉపయోగించే గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది జరిగింది మార్చి 8వ తేదీన. 1975 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. అప్పటినుండి అన్ని దేశాల్లో మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో సంవత్సరం ఒక్కో నేపథ్యంతో నిర్వహిస్తున్నారు. 2023లో "సాంకేతికతలో లింగ సమానత్వం"అనే థీమ్ తో నిర్వహిస్తున్నారు.

ప్రకృతిలోని నీరు, భూమి, ఆకాశాన్ని స్త్రీస్వరూపంగానే భావిస్తాం. వివాహ సమయంలో కూడా అరుంధతి నక్షత్రం చూపుతారు. అది ఒక స్త్రీకి భారతీయ సంస్కృతి ఇచ్చిన స్థానం. కానీ మన దేశంలో ఇందుకు భిన్నంగా పలు సంఘటనలు చోటు చేసుకుం టున్నాయి . మహిళలపై లైంగిక దాడులు నిత్య కృత్యాలుగా మారాయి. మహిళా రక్షణ చట్టాలు ఎన్ని చేసినా, కట్నం కోసం,కామం కోసం మహిళలని హింసిస్తున్న వార్తలు రోజు మనం వింటూనే ఉన్నాం. భారతదేశం మహిళలకు ఏ మాత్రం సురక్షితమైనది కాదని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై దాడులు జరుగుతున్నప్పటికీ మనదేశంలో ఇటీవలి కాలంలో విచ్చలవిడితనం, బరితెగింపు, క్రూరత్వం ఎక్కువైంది.

మనస్మృతిలోని "న స్త్రీ స్వాతంత్ర మర్హతి" అనే ఒక్క వాక్యాన్ని పట్టుకొని ఇప్పటికీ స్త్రీకి స్వేచ్ఛకు అర్హురాలు కాకుండా స్వేచ్ఛను, స్వాతంత్రాన్ని ఇవ్వడం లేదు . ఇప్పటికీ మహిళ రెండవ పౌరురాలుగా ,పురుషుని ఆస్తిగానే పరిగణించబడుతున్నది. మహాభారతంలోని అనుశాసనిక పర్వంలో కూతురు కొడుకుతో సమానమని భీష్ముడు అంటాడు. కానీ పూర్వ కాలం నుండి స్త్రీని ఏదో భారంగా, బావిలో కప్పలా, వంటింటి కుందేలుగా, కుటుంబ సభ్యులకు, పిల్లలకు సేవకురాలుగా మాత్రమే చూస్తున్నారు. ప్రాశ్చాత్య మహిళలతో పోల్చితే భారతీయ మహిళలు వెనకబడినట్లు పలు గణాంకాలు తెలియజేస్తున్నాయి. భారత దేశంలో ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అని గత ప్రభుత్వాలు చేసిన కృషి ఫలితంగా అక్షరాస్యతలో అభివృద్ధి చెందడం వలన ఇప్పటి పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉన్నా, ఇంకా ఎంతో మార్పు రావాల్సిన అవసరం ఉంది. అక్షరాస్యతత, కుటుంబ, సమాజ మరియు ప్రభుత్వ తోడ్పాటు వల్ల పలు రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నా శాస్త్ర సాంకేతిక ఆర్థిక రాజకీయ రంగాల్లో ఇంకా ఎంతో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నది. అందుకు యావత్ పురుష ప్రపంచం మహిళలకు తోడ్పాటునందించాలి.



-బొల్లం బాలకృష్ణ
9989735216

## అష్టలక్ష్ముల రూపం

జన్మకారణ సంతానలక్ష్మి
ఆప్యాయతలకే ఆదిలక్ష్మి
గృహ మందిరాన గజలక్ష్మి
ఆవేశంలో ఆమె ధైర్యలక్ష్మి
అత్యవసరాల్లో ధనలక్ష్మి
ఆకలిని తరిమే ధాన్యలక్ష్మి
సత్కార్యసిద్ధిలో విజయలక్ష్మి
సకలమెరిగిన జ్ఞాని విద్యాలక్ష్మి !
గృహ కోవెలలో కొలువైన దేవత
గడపకు పసుపు పారాణేగా వనిత
ఇంటి పందిరి తోరణమే గృహిణి
ఆకలికి దివ్య ఔషధమేగా అతివ
వంశాన్ని నిలబెట్టేదేగా వనిత
నాన్న ఊపిరి ఉనికేగా అమ్మ
బిడ్డల భాగ్యాన్ని కాంక్షించే తల్లి
సంసార వృక్షానికి
తల్లి వేరే ఆమె !.

సహనం సాగరమంత
శాంతం భూదేవంత
ఆరాటం అంతరిక్షమంత
ఆకాశంలో ఆమె ఓ సగం
పట్టు వదలని పోరాటం
సుద్గుణాల మేలిమి బంగారం

ఆవేశమెరుగని అమాయకత్వం
ఆమె అపూర్వ ఆస్తేగా
అమ్మతనం!.

అమృతం పంచటంలో అమ్మ
నవ్వుల ఊటల బాయి సోదరి
సహధర్మచారిణియే అర్ధాంగి
అమ్మను మరిపించే కూతురు
తల్లిని తలపించే వనితే వదిన
అమ్మకు ప్రతిరూపమే అత్తమ్మ
అనుభవ పాఠాల నిధి బామ్మ
బహుపాత్రధారి మహిళామణి !.

భ్రూణహత్యలను అడ్డుకుంటూ..
బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ..
అత్యాచారాల అంతుచూస్తూ..
గృహహింసకు
చరమగీతం పాడుతూ..
లైంగిక వేధింపులను
బొంద పెడుతూ..
లింగ వివక్షపై యుద్ధం చేస్తూ?
అబలను ఆకాశానికి ఎత్తుకుంటూ
సబలకు కల్పిద్దాం
లింగ సమానత్వం !



-డా: బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

## అప్పగింతల దుఃఖం....

చెటాకు జిలకర బెల్లం నెత్తిన పెట్టించుకొని..
మూడుముళ్లు మెడలో వేయించుకొని....
ఇంటిపేరు మార్చుకొని..
ఇరవై ఏండ్ల నవ్వులను సప్పుల్ల నడుమ వదిలేసి....
అవ్వగారింట్ల అప్పగింతల అడుగులతో ....
పెద్దర్వాజ కడప కడిగి ముగ్గేత్తాంటే
పంచపాలలో పచ్చముగ్గన్నదట
పుట్టింటి శారెపెట్టెలో నీకు తోడస్తున్నానని....
రెండడుగులు ఏయంగనే
అరుగు బండ కాళ్ళకడ్డమచ్చి నువ్వలసిపోతే
నేనున్ననని మర్శిపోకన్నదట....
పెరట్ల పూసిన గోరంట పూలు కండ్ల నీళ్ళు తీస్తూ
చెప్పినయట బతుకమ్మ పండక్కీ పదొద్దుల ముందుగాల్నే రమ్మని...
ఆకిట్లకి పొంగన్నే పది సుక్కల
ముగ్గు ఆపి ఓట్టేపిచ్చుకుందట
సంకురాతిరి పండక్కి రంగులునింప రమ్మని....
ఊరి పొలిమేర దాటుతాంటే పోషవ్వ తల్లి పూని
సెవ్వుల సెప్పిందట ఏట నాకాడికచ్చి
బెల్లం బువ్వండి మొక్కు తీర్చిపొమ్మని.....
కట్ట కింది చెరువు ఉర్కచ్చి సాగనొంపిందట
ఏడ్వకమ్మ నువ్వే ఒక అమ్మవై సృష్టిని నడిపించే అలిసిపోని అలవని..
ఊరవతలున్న చింతచెట్టు అన్నదట నువ్వు నీల్లోసుకుంటే
పులుపు తిన నీ కంచంల చింతకాయ తొక్కునైతనని...
ఆఖరికి రెండెకరాల పొలం అన్నదట
నీ అయ్య నీకిచ్చిన కట్నం నేనేనని కట్టమత్తే
కడుపు నింప నేనున్న పైలంగ పోయ్ రమ్మని...
పుట్టింటి బల్గానికి సెడ్డపేరు రాకుండ మసుల్కోమ్మన్నదట..
నాలుగ్గంటల్లో లగ్గం చేసుకొని కన్నోల్లని,
తోడబుట్టినోల్లని వదిలేసి...
ఆఖరి ముద్ద దాకా అత్తగారింట్లో కాలేకట్టేగా మారి...
నీతో నువ్వు యుద్ధం సేస్తూ రక్తపు ముద్దకి పానం పోసి..
పొత్తి కడుపు మీద కుట్ల గాట్లతో
బిడ్డలను కనే నీ కడుపాక గర్భగుడి....
అప్పిచేంత దుఃఖమున్న....
నీ ఆడజన్మే ఒక గెలుపు....



-తుమ్మల కల్పన రెడ్డి
9640462142

## మహిళా దినోత్సవం

కార్యేషు మంత్రి భోజ్యేషు మాత
ఎంత పొగిడినా కొదువ మగువ ఘనత
ఆమె భూమిపై నడయాడే దేవత
ఓ మానవ
మానుకోవా నీ చెడు నడత
మాయమైపోయిందా మానవత!
దానవత దాష్టికం చేస్తుంటే
మహిళ మరో శక్తి రూపం ఎత్తాలా!
మిగిలినారా
మానవత్వం మరిచిన మహిషాసురులు
దుర్యోధన-దుశ్శాసనాధులు !
మగువ ప్రాణ మానధనాలు
హరించే కాలనాగులు!
మరిచినారా
మహిళ మహా ఓ శక్తి జనిత
అరుంధతి సావిత్రి అనసూయ ల
చరిత్ర!
నాడు
హృది లో పదిలంగా దాచెనొక్కడు
శిరస్సున భద్రంగా మోసెనొక్కడు
అంతరిక్షం అన్వేషించే ఓ మానవా
అవనిలో మహిళను ఆదరించలేవా
వారు జీవకోటికి సారధులు
వారికి చెయ్యాలి
సహస్ర కోటి వందనాలు



- పి.బక్కారెడ్డి
9705315250

ప్రేమకు రూపం మహిళా
ఇంటికి దీపం మహిళా
జన్మకే జన్మనిచ్చు మహిళా
జగతికే జీవం ఓ మహిళా
దారి చూపు దేవతగా
ఇలకు నిన్ను పంపాడు
తనలో సగభాగమిచ్చి
అర్ధనారీషుడాయే శివుడు.
అనంత శక్తి రూపం మహిళా
అపార భక్తి భావం మహిళా

## మహిళా

ధరణిలో ధాత్రృత్వం మహిళా
బాధ్యతల బంధి ఓ మహిళా
స్వేచ్ఛ లేని జీవితాన
చిరునవ్వే తనఆభరణం
తరువుగా తరుణీ నిలబడి
శిధిల సౌధాలను మార్చు భవనముగా
భరించే భూమాత మహిళా

ప్రవహించే జీవనది మహిళా
జాతికే జాగృతి మహిళా
మనిషికి జీవరాగం ఓ మహిళా.
అమ్మ అత్తల ఇంటికి వారధి
తనయుల భవితకు సారధి
పువ్వుల సుకుమారం తనది
హిమ పర్వత రక్షణేఆమె చూపుది.

-సి. హేమలత
9666779103



## మహికే వెలుగు మహిళ

అబలల పండగ అంబరాన్నంటింది
శోభాయ మానంగా శుభాకాంక్షలు
సాటి మహిళలకు సాంకేతికంగా
సతీమణులకు సత్కారాలు
పరిధ పరిడవిల్లిన పణతులకు
పురస్కారాలు సాధించిన ఘనతను
సమీకరించి గుర్తింపునిచ్చిన గౌరవాలు
మనోల్లాసాలతో మహిళలకు
మహికే వెలుగు అంటూ మారుమ్రోగిన గొంతులు
అంతర్జాలమంతా నిండే అవని నిండా
శుభాకాంక్షలు శుభాభినందనలతో
అంతా ఒక్క రోజుకే నా?
ఈరోజు కోసమేనా?...
పుట్టుక నుండి చావు వరకు
క్షణక్షణం క్షామంగా ఎండి
నీరు కారుస్తున్న తన్వితనువును,
రాలుతున్న రుధిరాక్షువులను
వేదనతో నిండిన హృదికి తెలుసు
కొవ్వొత్తిలా కరిగే శరీరాకృతికి ఎరుక
ఎదమీటే మాటల అస్త్రాలకు, విలువనీయని శ్రమకు,
విశ్రాంతి లేని పనికి పరిచయం?
అందుకే?

ఆడది అనే చిన్నచూపు చూసే చక్షువులు
సామర్థ్యం కప్పేసిన చేతులుఉన్నంతకాలం
మహిలో వెలగదు మహిళ?
సాధికారత సార్థకం వ్రాతలకే పరిమితమైన,
సతి ఆక్రందనలు ఆమె సహజీవనమైన,
ప్రతి ఇంట,బయట చులకన చూపులు తోడైన
ఆమె అన్న పదానికి సారూప్యత లేకున్న,
ఎలా వెలుగును మహిళ?..
ఈ సృష్టికే మూలం సృజన
అమ్మలా ఆప్యాయత అందించి,
సోదరిలా ప్రేమానురాగాలు పంచి,
భార్యలా బాధ్యతలను పంచుకొని,
కూతురిలా కలిమిలేములలో తోడుండి,
కోడలిలా కలిసి జీవించి,
అమ్మమ్మ, నానమ్మలా ఆలనా పాలనా చూసుకొని,
స్నేహితురాలిగా ఆపదలో నీ వెంట ఉండి,
సహోద్యోగిగా సహాయసహకారం అందిస్తూ..
అన్నింటా తానై, అన్నింట్లో తానే అంటూ..
రాణిస్తున్న రవళులను నిత్యం గౌరవిద్దాం..
బ్రతుకు నిచ్చే భారవిని బ్రతకనిద్దాం..
అపుడే మహిలో మహిళలంతా వెలుగుదురు
రవిచంద్రులున్నంత వరకు..



-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

# మహిళల హక్కులకు స్వాతంత్రం ఎప్పుడు ?

**లింగ సమానత్వం ద్వారా స్త్రీ, పురుషులకు సమన్యాయం కలిపించడానికి కట్టుబడిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు తేవడానికి పార్టీల మధ్య ఏకాభిప్రాయం అనే సాకుతో ఆలస్యం చేయడం గమనార్హం.**

ఒక దేశ ప్రగతి పురోగతి స్త్రీ పురుష సమానత్వం పై ఆధారపడి ఉంటుంది. మానవ వనరుల్లో సగ భాగమైన మహిళలకు ప్రాధాన్య మిస్తున్న దేశాలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెంది అగ్రస్థానంలో నిలిచాయి.

స్త్రీ 'పురుష అసమానతలు ఎక్కువగా వున్న దేశాలు ఆర్థికంగా సామాజికంగా 'సాంస్కృతికంగా ఆశించిన మేరకు అభివృద్ధి చెందలేదు.

ప్రపంచ ఆర్థిక ఫోరం లింగ సమానత్వ సూచీ భారత దేశం

ప్రపంచ ఆర్థిక ఫోరం 2022 నివేదిక ప్రకారం ప్రపంచం లోని లింగ సమానత్వ సూచీలో భారత దేశం 146 దేశాల్లో 135 వ స్థానంలో నిలిచింది. స్త్రీ 'పురుష సమానత్వం కోసం నాలుగు ప్రధాన అంశాలు తీసుకొని అంచనా వేశారు 1) ఆర్థిక భాగస్వామ్యంలో143 వ స్థానం 2)రాజకీయ సాధికారిత అధికారం లో 48వ స్థానం 3)విద్యాభ్యాసంలో 107 వ స్థానం నిలిచిన భారత దేశం 4)వైద్య రంగములో అట్టడుగు 146వ స్థానములో వుంది. సమానత్వ సూచిలో 135వ స్థానములో ఉన్న మనదేశం కంటే కేవలం 11 దేశాలు మాత్రమే మన కంటె వెనుక బడి ఉన్నాయి. మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్ 'నేపాల్ లాంటి చిన్న దేశాలు స్త్రీ' పురుష సమానత్వంలో మనకంటే ముందు ఉన్నాయి.

**లోకసభ మహిళా సభ్యులు**

మన దేశంలో లోసభలో 543 పార్లమెంట్ సభ్యులు ఉంటే మహిళా సభ్యులు లోకసభలో .81 మంది రాజ్యసభలో 29మంది మహిళాఎం'పిలు వున్నారు .మొత్తం మహిళా సభ్యులు14.9 శాతం మాత్రమే వున్నారు. మొదటి లోకసభలో మహిళా ఎం' పి ల సంఖ్య22 కాగా ప్రస్తుత లోకసభలో మహిళా ఎంపి లసంఖ్య 81మాత్రమే వుంది. మాటలకే పరిమితమైన మహిళా సాధికారిత అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలు మహిళా సాధికారితను మాటలకే పరిమితం చేశాయి . శుష్క వాగ్దానాలు శూన్య హస్తాలతో మహిళా ప్రాతినిధ్యం పెంచడానికి కృషి చేయలేదు.శాసన నిర్మాణం స్త్రీల భాగస్వామ్యం శాసన నిర్మాణ వ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యం అతి తక్కువగా వుంది. మన పార్లమెంట్ ఉభయ సభల్లో మహిళా ఎం 'పి ల వాటా 15 శాతం లోపే వుంది .ప్రస్తుత లోకసభలో 81 మంది రాజ్య సభలో 29 మంది మహిళా ఎంపిలున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళా ఎమ్మెల్యే సగటు సంఖ్య 8 శాతం లోపే వుంది. తెలంగాణ ఏర్పడిన తొలి కేబినెట్లో ఒక్క మహిళా మంత్రి లేరు. ప్రస్తుత ఇద్దరు మహిళా మంత్రులు ఉన్నారు.ఇటీవల గుజరాత్' హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ఇదే కథ పునరావృతమైంది .మహిళా రిజర్వేషన్స్ బిల్లు మరో సారి పార్లమెంట్లో ప్రవేశ పెట్టాలని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది .తాజా పరిణామాలు చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యం మహిళా రిజర్వేషన్ మీద చర్చకు దారితీసాయి.

న్యాయ శాఖ మంత్రి లోకసభలో వెల్లడించిన గణాంకాలు రాజకీయ

**పార్టీలు మహిళలకు సముచిత స్థానం అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో వారి జనాభా దామాషా ప్రకారం టికెట్టు ఇచ్చి వారికి చట్ట సభల్లో సముచిత స్థానం ఇవ్వాలి. పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటిస్తూ మహిళలకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి.**

పార్టీల చిత్తశుద్ధిని ప్రస్ఫుటం చేశాయి.'ఆకాశంలో సగం అవకాశాల్లో సగం' అనే నినాదం నినాదంగా నే మిగిలిపోయింది ? స్త్రీలు పురుషులతో సమానంగా అభివృద్ధి చెందడం లేదు.అన్ని రంగాలలో స్త్రీ పురుష వివక్ష రాజ్యమేలుతుంది.

చట్ట సభల్లో మహిళా బిల్లు అనవసర జాప్యం జనాభాలో సగ భాగం వున్న మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్స్ చట్టం చేయడానికి రాజకీయ పార్టీల నేతలు మీన మేశాలు లెక్కిస్తూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. మహిళలకు ఒక సారి సీట్లు రిజర్వ్ చేస్తే శాశ్వతంగా తమకు అధికారం దక్కదన్నభావన మహిళా బిల్లు ఆవెూదం గాకుండా అడ్డు పడుతుంది.1996 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో ప్రవేశ పెట్టారు .అనేక పరిణామాలు అపరిమిత ఆలస్యం తర్వాత 2010లో బిల్లును రాజ్యసభ ఆమోదించింది. నాటి లోకసభ కాల పరిమితి తీరిపోవడంతో ఆ బిల్లు అమలుకు నోచుకోలేదు.

ఇటీవల కాలములో మహిళా బిల్లు పార్లమెంట్లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ పెరిగింది. లింగ సమానత్వం ద్వారా స్త్రీ, పురుషులకు సమన్యాయం కలిపించడానికి కట్టుబడిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు తేవడానికి పార్టీల మధ్య ఏకాభిప్రాయం అనే సాకుతో ఆలస్యం చేయడం గమనార్హం. రాజకీయ పార్టీలు మహిళలకు టికెట్ల కేటాయింపులో ధంద్వ వైఖరి మహిళా సాధికారిత సాధనకు కట్టుబడి వున్నామని మహిళా సంక్షేమమే మానవ సంక్షేమమని చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెడతామని ఎన్నికల మేనిఫెస్టోల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రకటించి మహిళలకు ఉచిత విద్య 'బాలికలకు ఉచితంగా సైకిల్లు ఇవ్వడం కంప్యూటర్' లాప్టాప్ లు ఇవ్వడం ఉచితాల ప్రకటనల్లో పోటీ పడుతున్న రాజకీయ పార్టీలు మహిళలకు వెనుకబడిన వర్గాల వారికి వారి జనాభా దామాషా ప్రకారం సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యాన్ని ఉదాసీనతను సాచివేత వైఖరిని అవలంబించడం శోచనీయం .

మహిళకు అందని ప్రజాస్వామిక న్యాయం రాజ్యాధికారంలో మహిళలకు సమాన వాటా పొందక రాజ్యాంగ పితామహుడు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయమైన ప్రజాస్వామిక న్యాయం మహిళలకు వెనుకబడిన వర్గాల వారికి అందని ద్రాక్ష అయ్యింది. మహిళలు ఓటుబ్యాంకు అధికార పార్టీ' ప్రతి పక్ష పార్టీలు ఎన్నికల సమయంలో మహిళలను 'బి.సి లను "వోటు బ్యాంకుగా 'వాడుకుంటున్నారు. పార్టీలు టికెట్ల కేటాయింపులో అదికార పంపిణీలో మగవాళ్ళకె పెద్దపీట వేస్తున్నాయి..

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంıı రాలైనప్పటికి అమృతోత్సవాలు జరుపుతున్నప్పటికి దేశ జనాభాలో సగభాగమున్న మహిళలకు శాసన నిర్మాణంలో అతి తక్కువ

**ప్రపంచం మొత్తం మీద కేవలం రెండు దేశాల్లో మాత్రమే పార్లమెంట్లో 50 శాతం కంటే ఎక్కువ మహిళా ప్రాతినిధ్యం కలిగి వున్నారు. 2016జూన్ గణాంకాల ప్రకారం రువాండా దేశంలో 63.8శాతం బోలివియా లో 53.1 శాతం**

స్థానం ఇవ్వడం. సమంజసం కాదు తక్కువ సంఖ్యలో వున్న వారు అధికారాన్ని చెలాయిస్తూ.అధిక సంఖ్యాకులైన మహిళలు మరియు వెనుకబడిన వర్గాల వారు రాజ్యాధకారానికి దూరంగా ఉండడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సామాజిక 'పాలన' రాజనీతి వేత్తలు, న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ దేశాలు మహిళా ప్రాతినిధ్యం 2022 లెక్కల ప్రకారం.అమెరికా' ఐరోపా 'సహారా ఎడారికి 'దక్షిణాన వుండే సబ్ సహారా' ఆఫ్రికా ప్రాంతాలలో జాతీయ పార్లమెంట్లో ప్రపంచ సగటు 26.2 శాతం కన్నా ఎక్కువే మహిళలు ఎం.పి లు గా వున్నారు. నేపాల్లో 34 శాతం బంగ్లాదేశ్ 21 శాతం పాకిస్థాన్ 20 శాతం భూటాన్ 17 శాతం మన దేశం కన్న మెరుగుగా ఉ న్నాయి. ఆసియా దేశాల్లో 19.2 శాతం అరబ్ దేశాల్లో 18.4 శాతం పసిఫిక్ దేశాల్లో 13.5 శాతం వుంది.

మన దేశం లో 10 నుండి 15 శాతం లోపు మహిళా ఎం.పిలు వున్నారు..

ప్రపంచం మొత్తం మీద కేవలం రెండు దేశాల్లో మాత్రమే పార్లమెంట్లో 50 శాతం కంటే ఎక్కువ మహిళా ప్రాతినిధ్యం కలిగి వున్నారు.2016జూన్ గణాంకాల ప్రకారం రువాండా దేశంలో 63.8శాతం బోలివియా లో 53.1 శాతం వుండగా 30 శాతం కంటే ఎక్కువ మహిళా ప్రాతినిధ్యం గల.దేశాల సంఖ్య పెరిగింది. రాజకీయాలలో మహిళల ప్రాతినిధ్యం ఇవ్వడంలో ఇతర దేశాల కంటే మన దేశం చాలా వెనుకబడి వుంది. పురుషులతో సరిసమాన సంఖ్యలో వున్న మహిళలు ఓటు హక్కును పురుషులతో పాటు సమానంగా వినియోగించుకున్నప్పటికి మహిళలకు చట్ట సభల్లో సముచిత స్థానం దొరకడం లేదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ ఉన్నపటికీ 90 శాతం మగవారే పెత్తనం చెలాయిస్తున్నారు. సతుల స్థానములో పతులు అధికారం చెలాయిస్తున్నారు.

**మహిళా సాధికారత సాధనకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు**

ప్రభుత్వం రాజకీయ రంగములో మహిళలను ప్రోత్సహించాలి. అందుకు అనువైన పాలన సామాజిక వాతావరణాన్ని కల్పించాలి.

ఎన్నికల్లో పోటీ చేస్తే పురుషుల కన్న మహిళలకే విజయావకాశాలు ఎక్కువ వుంటాయి. మహిళలు పోటీ చేస్తున్న స్థానాలలో ఎన్నికల వ్యయం తక్కువ వుంటుంది. సమాజములో సగ భాగమున్న మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వడం ద్వార మహిళలకు ప్రజాస్వామిక న్యాయం జరుగుతుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరుతుంది. మహిళలు ప్రజా ప్రతినిధులగా ఎన్నికైతె నేర రహిత రాజకీయాలు అవినీతి రహిత పాలనను అందించ వచ్చు.

రాజ్యాంగంలో పొందుపరచిన స్త్రీ 'పురుష సమానత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించబడి సామాజిక 'ఆర్థిక' రాజకీయ పంపిణీ న్యాయం సిద్ధిస్తుంది.

ఎన్నికల కమిషన్ సమగ్ర సంస్కరణలు రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో కచ్చితమైన శాతాన్ని రిజర్వ్.చేస్తేనే ఆయా పార్టీల గుర్తింపు కొనసాగుతుందనే నిబంధన ఎన్నికల కమిషన్ విధించాలని గిల్ ఫార్ములా సిఫారసు చేసింది. ఈ దిశగా ఎన్నికల కమిషన్ సమగ్ర సంస్కరణలు అమలు చేయాలి.

పార్టీలు మహిళలకు సముచిత స్థానం అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో వారి జనాభా దామాషా ప్రకారం టికెట్టు ఇచ్చి వారికి చట్ట సభల్లో సముచిత స్థానం ఇవ్వాలి. పార్టీలు అంతర్గత

**మహిళా సమస్యలు అభివృద్ధి సంక్షేమం మీద సామాజిక ఆర్థిక పాలనా వేత్తల చేత అధ్యయనం పరిశోధన జరగాలి. ప్రభుత్వం యూనివర్సిటీలలో వుమెన్ స్టడీస్ రీసెర్చ్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిశోధనకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి.**

ప్రజాస్వామ్యాన్ని పాటిస్తూ మహిళలకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రభుత్వం మహిళా సాధికారిత కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాల మంత్రివర్గములో మహిళలకు స్థానం ఇవ్వాలి . నీతి ఆయోగ్ లాంటి ఉన్నత స్థాయి సంస్థల్లో రాజకీయ నిర్ణయాలలో స్త్రీ పురుషులకు సమాన భాగస్వామ్యాన్ని కలిపించాలి. లింగ వివక్షత స్త్రీ పురుషుల ఉపాధి, ఉ దోగ కల్పనలో వున్న అసమానతలు లింగ వివక్షత రూపుమాపాలి.

మహిళా సాధికారిత సాధనకు మహిళలు పనిచేసే ప్రదేశాల్లో అనువైన వాతావరణాన్ని సృష్టించాలి. మహిళల మీద బాలికల మీద జరుగుతున్న హింస అత్యాచారాలను అరికట్టాలి.

స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు కల్పించాలి.

ప్రజా జీవితంలో రాజకీయ ఆర్థిక సామాజిక నిర్ణయాలలో శాసన నిర్మాణములో మహిళలకు క్రియా శీల ప్రాతినిధ్యం కల్పించాలి. స్త్రీలకు పురుషులతో పాటు నాయకత్వానికి సమాన అవకాశాలు కల్పించాలి.

మహిళా సాధికారిత ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గి సుస్థిరాభి వృద్ధితో కాలుష్య రహిత పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతుంది.

మహిళలు రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి.

మహిళలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. పాలనా సంస్థల్లో సహకార ఉద్యమంలో పౌర ఉద్యమాలలో మహిళలు చురుకుగా పాల్గొనాలి.

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆశించి భంగపడకుండ మహిళలు తమ హక్కుల రక్షణ భద్రత సంరక్షణ సంక్షేమ పథకాల మీద చట్టాల మీద అవగాహన చైతన్యం పెంచుకోవాలి. ప్రభుత్వం

స్థానిక సంస్థల ప్రత్యక్ష ఎన్నికల్లో1/3 వంతు సీట్లు మహిళలకు కేటాయిస్తూ ప్రవేశ పెట్టిన చట్టాలు సమర్థవంతంగా అమలు చెయ్యాలి. రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో టికెట్లు ఇవ్వడానికి పార్టీల పరంగా విధి 'విధానాలు 'నియమ నిబంధనలు ఏర్పాటు చేసుకోవాలి. రాజకీయ పార్టీలు అనుబంధ విభాగాలలో పార్టీల రాష్ట్ర జిల్లా స్థాయి ఆఫీస్ భేరర్లలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలి.

**మహిళా చైతన్యమే శ్రీరామరక్ష**

మహిళా సంఘాలు స్వశక్తి మహిళా గ్రూపులు డ్వాక్రా మహిళలు ప్రతి గ్రామ పంచాయితీ స్థాయిలో వున్న తల్లుల సంరక్షణ సంఘాలు పొదుపు సంఘాల ప్రతి నెల జరిగే సమావేశాల్లో మహిళా సాధికారిత సాధన మహిళల రాజకీయాల పట్ల చర్చించి అవగాహన పెంచుకోవాలి.

ప్రతి గ్రామంలో మహిళల చేత మద్యపాన నిషేధ కమిటీలు ఏర్పాటు చేసి మధ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రజలను చైతన్య పరచాలి. మహిళా లోక చైతన్యమే మహిళకు శ్రీరామరక్ష.

మహిళలు వివక్ష మహిళలను కించ పరిచే అన్ని రకాల వివక్షలను రూపుమాపాలి. స్త్రీలను చిన్న చూపు చూసే సమాజ పరిస్థితులు మారాలి. మహిళల పట్ల గౌరవం పెరగాలి. మహిళల పట్ల పురుషుల ఆలోచన వైఖరిలో మార్పురావాలి. మహిళా మానవ నిర్మాత మహిళా మానవ నిర్మాత అనే స్పృహ పెరగాలి. లింగ సమానత్వం సమాన వేతన చట్టం 'గృహహింస చట్టం' వుమెన్ ట్రాఫికింగ్, చట్టం అత్యాచారాల నిరోధ చట్టం' బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన హిందూకొడ్ బిల్లును అమలు చేయాలి' మహిళల పై అత్యాచారాలు 'ఆసిడ్ 'దాడులు అరికట్టాలి. దిశా, నిర్భయ చట్టం అమలుకు ఫాస్ట్ ట్రాక్కోర్టులు ఏర్పాటు చెయ్యాలి. పోలీస్ సేషన్ లో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి మహిళ సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి.

జాతీయ' రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర ప్రతిపత్తితో కూడుకున్న "మహిళల కమిషన్స్" ఏర్పాటు చేసి మహిళలకు సత్వర న్యాయం జరిగే వ్యవస్థను బలోపేతం చెయ్యాలి.

జాతీయ మహిళా విధానం 2001ను అమలు చెయ్యాలి. ఆడ, మగ అనే విచక్షణ పాటించకుండా స్త్రీ పురుషులు ఇద్దరు సమాజ ప్రగతి రథానికి చక్రాలలాంటి.వారని సమాజం భావించాలి. సాంప్రదాయకంగా మహిళలు ఇంటికి ఇంటి వ్యవహారాలకు పరిమితం కావాలన్న భావన కుటుంబాలు విడనాడాలి. స్త్రీ పురుష సమానత్వం సమాన అవకాశాల కల్పన కుటుంభం నుండే ప్రారంభం కావాలి. నూతన విద్యా విధానంలో లింగ వివక్షత స్త్రీ , పురుష సమానత్వం సమాన అవకాశాల మీద పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టీ విద్యార్థి దశలోనే లింగ సమానత్వ సాధనకు ఉపకరించే విద్యా పాలన సంస్కరణలు అమలు చెయ్యాలి.

**మహిళా విద్యను ప్రోత్సహించాలి.**

మహిళా సమస్యలు అభివృద్ధి సంక్షేమం మీద సామాజిక ఆర్థిక పాలనా వేత్తల చేత అధ్యయనం పరిశోధన జరగాలి. ప్రభుత్వం యూనివర్సిటీలలో వుమెన్ స్టడీస్ & రీసెర్చ్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిశోధనకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి.

సాక్షరత భారత్ 'జన శిక్ష సంస్థాన్ స్వాధార్ యోజన స్త్రీ శక్తి పురస్కార్ యోజన భేటీ భచావో భేటీ పడావో లాంటి విద్యాభివృద్ధి పథకాలు ఆరోగ్యం తాగునీరు ఆర్థిక స్వావలంబన లింగ సమానత్వం మహిళా సాధికారతకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలి.

సమర్థత నైపుణ్యాలతో స్త్రీ పురుషుల మధ్య విచక్షణను కట్టడి చేయాలి. మహిళా రాజకీయ ప్రాతినిధ్యం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రచారం చెయ్యాలి. ప్రభుత్వం ప్రసార సమాచార శాఖ మహిళా హక్కులు మహిళా చట్టాల మీద మహిళా సంఘాలకు శిక్షణ అవగాహన చైతన్య సదస్సులు సమావేశాలు నిర్వహించాలి.

న్యాయ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో మహిళల రాజ్యాంగ హక్కుల రక్షణ సివిల్ క్రిమినల్ హక్కుల రక్షణకు 'భద్రతకు ఉచిత న్యాయ సేవలు అందించి మహిళకు సామాజిక న్యాయం సమకూర్చాలి. షి టీములు, సఖీ సెంటర్స్. మహిళా హక్కులపై అవగాహన కల్పించాలి. చరిత్రలో ప్రసిద్ధి చెందిన మహిళల జీవిత చరిత్రలు వారు సాధించిన విజయాల గురించి పాఠశాల కళాశాల విద్యార్థులకు వివిధ కళారూపాల ద్వారా ప్రదర్శనలు ఏర్పాటు చేసి మహిళా శక్తి సామర్థ్యాలను సమాజానికి చాటాలి. మీడియా స్త్రీల ప్రతిష్ట మీడియా సినిమా పత్రిక ప్రసార మాధ్యమాలు మహిళలను కించ పరిచేలా దృశ్యాలను చిత్రీకరించవద్దు. మహిళా విలువలను తక్కువ చేసి చూపించే నాటికలు నాటకాలు సీరియళ్లు నిషేధించాలి.

మహిళా సంక్షేమమే ధ్యేయంగా స్త్రీ జాతి ప్రతిష్టను కాపాడుకోవడంలో ప్రభుత్వం పౌరసమాజం మహిళా సంఘాలు గురుతర బాధ్యత పోషించాలి. అధికార పార్టీలు తమ గెలుపులో సగ భాగమైన స్త్రీ ల రుణం తీర్చుకోవడానికి ఆరోగ్యం విద్య 'వైద్యం ఉపాధి' శిక్షణ తదితర రంగాలలో దీర్ఘకాలిక ప్రణాళికలతో మహిళా సాధికారిత ను సాధించే పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చెయ్యాలి.

కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన చట్టాలు హక్కులు తమ రక్షణకు ఉపయోగ పడతాయని విశ్వాసం స్త్రీలకు కలిపించాలి. మహిళలకు విద్య 'వైద్యం పోషకాహారం అన్ని రంగాలలో సరైన న్యాయం కల్పించాలి. మెరుగైన జీవన ప్రమాణాల పెరుగుదలకు చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్స్ ఉపయోగపడతాయి. మానవీయ కోణంలో లింగ సమానత్వం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక మహిళాభివృది వ్యూహాలను రూపొందించింది అమలు చేయాలి.

**మహిళాభివృద్దే మానవాభి వృద్ధి**

లక్ష్యంగా మహిళా హక్కులు మానవ హక్కుల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర మహిళా వికాసానికి దోహద పడే కార్యాచరణతో మహిళా సాధికరితక సాధనకు ఉ పక్రమిస్తుందని ఆశిద్దాం.



-నేదునూరి కనకయ్య
9440245771

పుస్తక సమీక్ష

# మహిమాన్విత చరితమే " శ్రీ యాదాద్రి వైభవం"

"శాస్త్రం భగవంతుని యొక్క పరి వ్యాప్తి గురించి చెబుతుంది. అంతటా నిండి ఉన్న ఆ స్వామి కొన్ని ప్రాంతాలలో నరసింహ రూపుడిగా కాన వస్తాడు. అన్ని చోట్ల ఉ న్నాడు .అసుర శక్తి నుంచి నాశనం చేయడానికి దేవుడు ఏదో ఒక రూపంలో, దుష్ట రక్షణ శిష్ట రక్షణ కోసం వస్తాడు .హిరణ్యకశిపుని సంహరించడానికి ఆ శ్రీహరి నరసింహ స్వామిగా అవతరించాడు."

కాశీఖండం మొదలు గా తెలుగులో ఎన్నో క్షేత్రమహత్యము గల కావ్యాలు వెలువడినవి. ఇంకా వెలువడుతూనే ఉన్నవి. అలాంటి కావ్యములలో ఒకటి "శ్రీ యాదాద్రి వైభవము". యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి వైభవం ప్రపంచ ప్రఖ్యాతి పొందుతున్న సందర్భంలో క్షేత్ర మహత్యములోని అంశాలను పండిత పామర జనరంజకంగా భక్తి భావంతో కవి గారు బండి కాడి అంజయ్య గౌడ్ ఆవిష్కరించారు.

బాల్యం నుండే భగవంతున్ని పరమావధిగ భావించి ,నిత్యం పూజించి, భజించినవాడు భక్త ప్రహ్లాదుడు ."ఇందుగలడనీడు" అన్న ఆ బాల భక్తుని మాట





వృధా కాకుండా స్తంభంలో నుండి విష్ణుమూర్తి ఉగ్ర నరసింహ స్వామి గా ఆవిర్భవించాడు. ఉగ్ర నరసింహస్వామిగా హరి ఆవిర్భవించాడు. కలియుగంలో భక్తులను ఉద్ధరించడానికి అనేక పుణ్యక్షేత్రాలలో నరసింహస్వామి వెలిసి ఉన్నాడు. అలా వెలసిన క్షేత్రాలలో మహిమలు కలిగినది యాదాద్రి. శ్రీమన్నారాయణ యాదాద్రిపై నరసింహమూర్తిగా, వెలసిన కథ "శ్రీ యాదాద్రి వైభవంలో" బండకాడి అంజయ్య గౌడ్ గారు చక్కని కవిత్వంతో పద్యాలతో గ్రంథ బద్ధం చేశారు.

సహజ పండితుడు అష్టావధానిగా కవి అంజయ్య గౌడ్ పద్య రచనల్లో గల తన నేర్పరితనాన్ని ప్రతిపద్యంలో చక్కగా ప్రదర్శించారు. వృత్త పద్యమునకు ఉన్నంత ప్రాధాన్యత తో పాటు దేశి చందస్సు కు కూడా అంతే ప్రాముఖ్యతను కలిగించారు. వీరి రాసిన యాదాద్రి వైభవం నిత్య పారాయణ యోగ్యంగా ఉన్నది.

తెలుగు చందస్సులోని వివిధ ప్రక్రియలలో ఉ త్తమ కవిత రచన కొనసాగుట బ్రహ్మాండ పురాణం అంతర్గత వివరాలను స్వీకరించి సంస్కృత మూలాలను దాగివున్న నిగోదాన్ని కవిగారు యాదాద్రి వైభవంలో చక్కగా విశదీకరించినారు అంతేకాకుండా వీరి కవిత రచన పద్ధతి గద్య పద్యాత్మకంగ కొనసాగిన తీరు ఆనందాన్ని కలిగించడమే కాకుండా శక్తిని పెంపొంది చేస్తుంది.

ఈ కావ్యంలో ఋష్య శృంగ పుత్రుడైన యాదర్షి కథ మహామాన్వి తంగ ఉంది .మరుగున పడిన పౌరాణిక సంపత్తిని వెలికి తీసి కావ్య ఆభరణాలుగా మలిచిన అంజయ్య గౌడ్ కథాగమనానికి వర్ణాలకు తగిన విధంగా చందస్సు ఎన్నుకోవడం వారికి పద్యాల పై ఉ న్న పట్టును తెలియజేస్తుంది. కవిగారి కలం నుండి ఇలాంటి మరెన్నో భక్తిరస కావ్యాలు జాలువారాలని కోరుకుంటూ అభినందనలు.

"యాదాద్రి వైభవంబును
వేదాంతస్సా రవిదిత విద్యాత కవీనీ
ద్రాదిమ యశస్వి"అంజయ"
నాదాత్మక శైలి వ్రాసె నవ్య తరముగన్"

కవిగారు బండకాడి అంజయ్య గౌడ్ 254 గద్య పద్యాలతో ఏకాశ్వాస ప్రబంధంగా రాసిన కావ్యం. "శ్రీ యాదాద్రి వైభవం"ఇందు లోని ప్రతి పద్యం ఆసక్తికరంగా రాశారు. పుస్తక ముఖ చిత్రం యాదాద్రి క్షేత్ర నీతో పాటు ,నరసింహస్వామి మూల విగ్రహంతో ఆకర్షణీయంగా ఉంది.

పుస్తకం వెల 100 రూపాయలు.
-పుస్తక ప్రతులకు:
-బి అంజయ్య గౌడ్, రేణుక నిలయం
ఇంటి నెంబర్:2బి11/231
శ్రీ బాలాజీ ఎంక్లేవ్ , మల్లంపేట
మండలం:దుండిగల్
మేడ్చల్ జిల్లా500090
చరవాణి: 9096163962



-యాడవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

## నానీలు

ఉద్యోగానికైతే
అర్హతలుండాలి
'నేత'వడానికి
'మనిషి' ఐతేచాలు!.

వేరు చిన్నదే
రాతిని చీలుస్తుంది
'నానీ' చిన్నదే
గుండెను పిండేస్తుంది.



- శ్రీరామమూర్తి
చిమ్మపూడి
సెల్: 9704177270



మార్చి 2న గురువారం పొన్నూరు లుంబినివనంలోని అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్నందు కత్తి మాణిక్యమ్మగారి 26వ వర్ధంతి సందర్భంగా మరియు అంబేద్కర్ జీవిత చరిత్ర రెండవ భాగం రాత ప్రతి పూర్తి చేసిన సందర్భంగా లోకాయత పబ్లికేషన్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ (అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, నాగార్జున యూనివర్సిటీ), మదిర శేషయ్య (అంబేద్కర్ ఎ.ఏ.ఎం. కన్వీనర్ మరియు లోకాయతా పబ్లికేషన్స్ ప్రమోటర్), పి. రాంబాబు (ఏలూరు), వి. రాంబాబు (ఏలూరు), చంగల్ రాయుడు (తిరుపతి), మదిర విల్సన్లు లుంబినివనాన్ని సందర్శించి మహాకవి, డాక్టర్ కత్తి పద్మారావును సన్మానించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



శ్రీవాణికి పురస్కారాన్ని బహూకరిస్తున్న మధుసూదనాచారి, కళా జనార్ధనమూర్తి.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మెల్సీ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో కళాసుబ్బారావు కళావేదికలో సంఘ సేవకురాలు, నిభానుపూడి శ్రీవాణికి మహిళా పురస్కార ప్రదానోత్సవం జరిగింది. మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డును అందజేసి మాట్లాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, బ్రాహ్మణభవన్ వ్యవస్థాపకులు గిరిప్రసాద్శర్మ, శైలజ, బండి శ్రీనివాస్, ఉషా, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



నరసయ్యను సన్మానిస్తున్న వంశీరామరాజు, దైవజ్ఞశర్మ తదితరులు

## దాతల సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు

దాతల సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు అన్నారు. నవ సహృదయరాగం సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సహకరించిన కళాభిమాని, గ్రేటర్ ఇన్ప్రా. ప్రాజెక్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నరసయ్యను సన్మానించారు. లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ అధినేత రామాచారి, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విలాసం

ఆడపిల్లలు గల్లయిల్లిల అందమైనది కోవెలా
ఆడపిల్లకు సేవ జేసిన యంబయే ముదమొందురా
ఆడపిల్లయె భారమవ్వదు ఆత్మ తృప్తికి నాందిరా
ఆడపిల్లొకతుంటె చాలుర ఆత్మ స్థైర్యము హెచ్చురా..!

వాణి గౌరిగ లక్ష్మిరూపుగ వాస్తు బంచెటి కాంతిరా
వేణి మెల్కొల బాధతీర్చెటి వేల్పు పల్కుల కీర్తిరా
పాణితో రసరమ్య భోజ్యము పంచె శక్తియె పావనీ..
బోణిగన్ శుచి చిత్రలాస్యపు పుణ్య
కృత్యపు శోభినీ ...!

యెట్టి కాలపు నీతి కైతల యింగితాలకు భక్తిరా
వొట్టిమాటలనెల్ల బల్కక పుట్టినింటికి యుక్తిరా
పట్టుబట్టియు యారుకర్మల ప్రజ్ఞపంచెటి రక్తిరా
మెట్టినింటికి కీర్తి కూర్చెటి నిండు గుండెల శక్తిరా..!

ఎన్ని యున్నను ఏమి జూసిన ఎంత ముచ్చట గొల్పినా
ఎన్ని యేడులు భిన్న వేడుక లెంత కన్నుల పండినా
నిన్ను జూచితె చాలు యెప్పుడు నిక్కమే హృది నిండె,నా
కన్నులెంతటి భాగ్యమందెనొ
కాంతరో నిను గాంచగన్..!

రామరామని నోటముత్యపు
రాణిగను విహరించు బల్!
ఏమి జెప్పిన యేమి లాభము
ఎంత చింతన జేసినన్
కామితంబులుదీర్చె
శక్తిగ కర్మధర్మపు భోగినీ
క్షేమదాయక కర్మయోగిని
శ్రేయమెంచె సుహాసినీ..!



-డా.పొందాల మహేశ్వర్



మహాకవి కత్తి పద్మారావు కవిత్వంలో

# దళిత జీవన దృశ్యాలు

**"ఆ ఏరు పరవళ్ళు తొక్కుతుంది**
**ఆ ఏటి ఒడ్డునే కవి పుట్టాడు**
**ఏటి తరగల్ని అక్షరాలుగా కూర్చాడు**
**కవి ఏటి ఒడ్డున కూర్చుని**
**పక్షి భాష నేర్చాడు**
**పక్షి భాషతో ఖండాంతరాలకు చేరాడు**
**ఏటిలో ఎన్నో పాటలు పుట్టాయి**
**ఏటికి దేశీయతవుంది**
**ఆ స్వరంలో గేర లేదు**
**ఏటి ఒడ్డున ఉన్న వేపచెట్టుకు**
**పట్టిన తేనె తెట్టెను**
**కవి నాలుక అందుకుంది"** – ఏటి ఒడ్డున పురుడు పోసుకుని, బొడ్డుతాడు తెగ్గోసుకుని, ఏటి తరగల్ని అక్షరాలుగా దిద్ది, పక్షి భాషనేర్చి, పాట లోని కమ్మదనాన్ని, తేనెతుట్టెలోని తీయదనాన్ని తమ కవిత్వంలో కలుపుకుని జనంమెచ్చిన, జగమెచ్చిన మేటి కవిగ, కాలం వెంటకవిగ, క్రాంతదర్శిగా సాగిపోతున్న దళిత కవితా సంధ్యుడు డా॥ కత్తి పద్మారావు గారు. పద్మారావు గారు ఎంతటి సహజ కవో, సామాజిక కవో, సామ్యవాద కవో పై పాదాలు సాక్ష్యాలు. కవిత్వానికి దేశీయతా సుగంధాన్ని అద్ది, గ్రామీణ పదబంధాలతో సొగసు లద్ది, అట్టడుగు ప్రజల జీవన ముఖ చిత్రాన్ని మనకు ప్రత్యక్షంగా చూయిస్తున్న కవి పద్మారావు గారు.

పద్మారావు అన్నగారు మూసకవి కాదు. మూలవాసుల కవి. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నుండి ఆవిర్భవించిన కవి. సమాజంలో అగ్రవర్ణాల దురహంకారాన్ని, కండ కావరాన్ని ఎండగట్టేందుకు కలంపట్టిన కవి అన్ని విధాల అన్యాయానికి గురవుతున్న అట్టడుగు ప్రజల మూగ వేదనకు అక్షర రూపమిచ్చి గళమెత్తి గర్జించిన కవి. మంచిని ప్రేమించేకవి. మానవతను గౌరవించే కవి, దళిత సోదరుల సాధికార, స్వపరిపాలన కోసం రాస్తూ, అడుగులేస్తూ, ఆచరణాత్మక జీవనం సాగిస్తున్న మనతరం దళిత మహాకవి.

"ఈ దేశం మాది" అంటే అందరిదీ కాదని చెమటను సంపదగా మార్చే శ్రమ జీవులదని చాటి చెప్పినకవి. ఈ దేశ సంస్కృతికి, చరిత్రకు పునాదులు మూల వాసులవేనని నిష్కర్షగా నిజాన్ని బయట పెట్టిన కవి.

**"వాని రెక్కల కష్టము లేనినాడు**
**సస్యరమ పండి పులకింపసంశయించు**
**వాడు చెమ్మట లోడ్చి ప్రపంచమునకు**
**భోజనముపెట్టు, వానికి భుక్తిలేదు"** అని

మహాకవి జాషువ ఏనాడో శ్రమ దోపిడీని వివరించారు. పండించే వాడు కడుపునిండా తినలేని దౌర్భాగ్యాన్ని ఎత్తి చూపారు. ఎవడి చెమట బొట్టు మీద ఆధారపడి ప్రపంచం బతుకుతుందో అతడికి జరుగుతున్న అన్యాయాన్ని అక్షరీకరించారు. కవిగా జాషువా వారసత్వాన్ని, నిరసన స్వరాన్ని స్వీకరించిన పద్మా రావు గారు కోట్లాది మంది దళితుల "ఆత్మ గౌరవ స్వరం"గా నిలిచారు. ఆ దన్నుతోనే "ఈ యుగం మాది" అన్నారు. ఆ బలంతోనే ''ఈ దేశం మాది'' అని నిర్భయంగ ప్రకటించారు. ''కట్టెల మోపు'' మోసిన పద్మారావు గారికి 'భూమి భాష' తెలుసు. 'వచన కవితా పితామహుడు కుందుర్తి వచన కవిత్యోద్యమానికి అక్షర సాక్ష్యాలు పద్మారావు గారి కవితలు. వచన కవిత పరిణామక్రమంలో భాష సరళీకరణ, భావ విపులీకరణల్లో పద్మారావు గారి కవిత్వం ఒక మైలురాయిగా నిలుస్తుంది. కుందుర్తి కోరుకుంది కూడా అదే.

ఈ కవితా సంపుటిలోని చాలా కవితల్లో గ్రామీణ శ్రమ జీవులకు జరుగుతున్న అన్యాయాన్ని గళమెత్తి గర్జించారు. మనం మూలవాసులుగా చెబుతున్న వారంతా సకల విద్యల్లో ఆరితేరిన వారున్నారు. సమాజ పరిణామానికి నిర్దేశకులన్నారు. వాళ్ళు కవిత్వానికి, సకల కళలకు జీవధారమవులన్నారు. సకల శాస్త్రాలు చదివిన వారన్నారు. శ్రమతో భూమిని పులకరింప చేసిన వారన్నారు. వారు లేని సమాజాన్ని ఊహించలేదన్నారు. అటువంటి దళితులకు తన చూపుడు వేలుతో దారి చూపిన దిక్సూచి డా॥బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో ఆ మహనీయుడి కృషిని, కలల్ని, ఆకాంక్షల్ని తమ రచనల్లో ప్రతిఫలింపచేస్తున్న "అభినవ అంబేద్కర్" డా॥ కత్తి పద్మారావు గారు. అంబేద్కర్ రాజ్యాంగం రాసి తద్వారా దళితుల జీవనానికి, భవితవ్యానికి చట్టబద్ధత కల్పిస్తే పద్మారావు గారు మరో అడుగు ముందుకు వేసి రాజ్యాధికారమే దళితుల గమనం, గమ్యం అన్నారు. ఆత్మ విశ్వాసం గల కవి మాత్రమే తన వెంట వచ్చేవారికి దారి చూపుతాడు. పద్మారావు గారి కవితలు ఆ దారికిరువైపులా దివిటీలుగా నిలుస్తాయి.

పద్మారావు గారు కేవలం కవి మాత్రమే కాదు. అంతకు మించిన పండితుడు. పండితుడు మాత్రమే కాదు. గొప్పవక్త. వక్త మాత్రమే కాదు వేలాది మంది శిష్యుల అభిమాన అధ్యాపకుడు, పద్మారావు గారి కవిత్వంలో ప్రజాకవి వేమన సామాజిక దృష్టి కన్పిస్తుంది. మహాకవి జాషువ చైతన్య స్వరం విన్పిస్తుంది. "కవిరాజు" త్రిపురనేని భావ విప్లవ జ్వాల దర్శనమిస్తుంది. కుసుమ ధర్మన్న బోయి భీమన్నల రచనలు చేసిన పద్మారావు గారు ఓ సామాజిక విప్లవజ్వాల. కోట్లాది మంది అభాగ్యుల గొంతుక. అన్నగారు మనుషులు సూర్యుళ్ళ మందాలంటారు. అంబేద్కర్ చూపిన వేకువ వెలుగులో నడవాలంటారు. దేవుళ్ళను వ్యతిరేకిస్తారు. మనుషుల్ని ప్రేమిస్తారు. కుల దురహంకారం ఇంకానా? ఇకపై చెల్లదంటారు.

**"ఇక రాబోయేది**
**సంకెళ్ళ తెంచే కాలం**
**గోడలు కూల్చే కాలం**
**నల్ల మేఘాలు తెల్ల మేఘాలు**
**పెనవేసుక వర్షించే కాలం"** అంటారు ఓ కవితలో

**"రోజా చెట్టు పూస్తుంది.**
**మరి మనిషిలో సృజన ఏది?**
**ఆలోచించేవారే**
**అనుభూతి చెందేవారే సజీవులు**
**వారు సృజించే అక్షరాలు**
**రాబోయే చరిత్రకు గుర్తులు"** అన్నారు మరో కవితలో.

> పద్మారావు అన్నగారు మూసకవి కాదు. మూలవాసుల కవి. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నుండి ఆవిర్భవించిన కవి.

వర్తమాన దళిత సాహిత్యాన్ని పద్మారావు గారికి ముందు వెనుక రెండుగా విభజించి చూస్తే, పద్మారావు గారి రచనల్లో దళిత సాహిత్యం తన ముఖ చిత్రాన్ని మార్చుకుని, ఎంతగా విస్తరించిందో గమనించవచ్చు. సాహిత్యంలో "గాంధీయిజం"కు తెనుగు వెంకట తమ్మెలవారు, ''బుద్ధిజం''కు కరుణశ్రీ, 'కమ్యూనిజం'కు శ్రీశ్రీలా "అంబేద్కరిజం"కు పద్మారావు గారు సాధికార వ్యాఖ్యాత. 'అంబేద్కరిజం' నకల మానవ జీవన తత్వశాస్త్రం అంటారు. ఉన్నవాడికి, లేనివాడికి మధ్యవున్న అగడ్తలను దాటడానికి రాజ్యాంగాన్ని వారధిగా నిర్మించిన అంబేద్కర్ బడుగు జీవుల ఆశారేఖ అన్నారు. శ్రమను గొప్ప సంపదగా భావించే పద్మారావు గారికంటే ప్రేమమూర్తి ఎవరుంటారు? ప్రేమ విశ్వ జనీన వస్తువంటారు. కనుకనే.....

"ప్రేమ ఒక మహోజ్వల జీవన ప్రవాహం" కవితలో ఇలా అంటారు.

**"ప్రేమ ఒక మహోజ్వల జీవన ప్రవాహం**
**ప్రేమలేని మనుషులు**
**ఎండుకట్టెల లాంటివారు**
**వారికి మండటమే గానీ**
**చిగురించడం రాదు**
**ప్రేమను నిర్వచించడం తేలిక**
**అనుభవించడం చాలా కష్టం"** అంటారు

"ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును" అన్న గురజాడ వారి ప్రేమ సూత్రాన్ని జీవన సూత్రంగా విస్తరించిన వారు పద్మారావు గారు. హేతువాది అయిన పద్మారావు గారు పలకని దేవుడి కంటే పలికే మనిషి గొప్ప వాడ ంటారు. ఏ వస్తువూ మానవుడంత విలువైంది కాదంటారు. మనిషంటే నిలువెత్తు నిజం అంటారు. మనిషిని మనిషిగా కాక కులంగా చూసే వ్యవస్థ వున్నంతకాలం ఈ అవస్థలు తప్పవంటారు.

"శాస్త్రాలు చదివి మీరేం నేర్చుకున్నారు?
ప్రతి రాయినీ దేవుణ్ణి చేశారు
మనిషిని అర్థం చేసుకోలేకపోతున్నారు" అని సూటిగా ప్రశ్నిస్తారు.

**"మనిషి ఓ తర్కం**
**మనిషి ఓ గానం**
**మనిషి ఓ పాఠం"** మనిషిని నిలువెత్తు జ్ఞానంగా ఆవిష్కరిస్తారు.

కాళిదాసు ఉపమ, భారవి అర్థ గౌరవం, తిక్కన ధ్వని ముద్ర, పోతన పదలాలిత్యం అన్నీ పద్మారావు గారి కవిత్వంలో కొత్త రూపాన్నిత్తైకున్నాయి. సరికొత్తగా విరబూశాయి.

**"నిజమే... ఉక్కు పాదాలతో**
**అణగ దొక్కినవాళ్ళు**
**దుమ్ములో కలసిపోయారు**
**అణగదొక్కబడినవాడు**
**ఆకాశ నక్షత్రంగా వెలుగొందు తున్నాడు**
**ఛార్లీ చాప్లిన్ని, ఐన్‌స్టీన్‌ని**
**ఒకనాడు అమెరికా నిషేధించింది**
**ఇపుడు అమెరికాకంటే**
**వాళ్ళిద్దరే ఎత్తులో వున్నారు."**

శాస్త్రీయ చారిత్రక దృష్టి అంటే ఇదే! కవులు మూస భావాల ఉండి బయటపడి కొత్త దృష్టిని అలవరచుకోవాలి. అందుకు పద్మారావు గారి వంటి కవుల్ని చదవాలి.

**"ఆ కడవి ఒడ్డున నిలబడి**
**ఆ చిన్నోడు తిమింగలాన్ని చూసి**
**భయపడటం లేదు**
**ఆ పిల్లోడి మొలతాడుకు కట్టిన**
**గువ్వల శబ్దానికి తిమింగలం**
**భయపడి వెనక్కు వెళ్ళిపోయింది**
**వాడి ఉంగరల జుట్టుకు మురిసి**
**నక్షత్రాలు ముద్దు పెట్టుకుని వెళ్తున్నాయి**
**రేపు వాడు సముద్రాన్ని జయించగలడనే**
**సంకేతాలు పలుకుతున్నాయి.**

**ఇంతకంటే కవిత్వం ఉంటుందా?** కవిత్వంలోని తిమింగలం, సముద్రాన్ని పిల్లోడు జయించడం అనే రెండు మాటల్లో సమాజం లోని దోపిడీని, దాని విశ్వ రూపాన్ని వివరించి, నాటి బాల చంద్రుడిలా, మొలతాడు గట్టిన పిల్లోడు ధైర్యాన్ని కవచంగా ధరించి, ప్రపంచాన్ని జయిస్తాడంటారు పద్మారావుగారు. కాన్షీరాం కలలుగన్న దళితుల రాజ్యాధికారాన్ని ఎంత ధ్వని గర్జిస్తుందో కవి చెప్పారు మనం గమనించవచ్చు.

పద్మారావు గారి కవితల్లోని గ్రామీణ పలుకుబడులు, పదబంధాలు ఈ సంపుటిలో కోకొల్లలు.

**"బియ్యపు పిండిలో బెల్లం కలిపి**
**కొబ్బరి ముక్కలు కూర్చి**
**కుడుములు చేసి**
**తన బిడ్డకు తినిపిస్తుంటే**
**సూర్య చంద్రులు ఆమెను చూసి**
**అయ్యో! మాకూ తల్లి ఉంటే**
**ఎలా ఉండేది"** అనుకుంటారు. ఇదీ కవిత్వం. ఈ పాదాలకు నా పొడి మాటల వ్యాఖ్యానం కలిపితే వాటిలోని తడి ఆవిరై పోతుంది. సి.నా.రే. అన్నట్లు "కవిత్వాన్ని కొన్ని చోట్ల కప్పివుంచాలి. అంతే!

**"ఎండలో మిరపకాయలు కాసే వీరమ్మ చేతులు**
**బద్దలుగా పగిలి**
**భారతదశ పటం అందులో కనిస్తుంది."** అంటారు

**"సువార్తమ్మ ఏనాడూ**
**యాస్లీసుకామె కొరికెరగదం"**టారు.
**"మట్టి నుండి విత్తనాలు కాదు**
**మేధావుల్ని మొలిపించాలి"** అంటారు.
**"గొంగూర మాంసం వండాక**
**మేలి మేలి ముక్కల్ని**
**కొత్తగా గడప తొక్కిన**
**పెళ్ళికూతురుకి తినిపిస్తారు వారు**
**బువ్వను పంచుకోలేనివాడు**
**ఏం మొగుడు?"**

ఇలాంటి పాదాలెన్నో గుండెనాదాలై, శ్రామికుల జీవన నినాదాలై కొత్త భాషను కొత్త జీవితాన్ని, ప్రేమతత్వాన్ని మనకు పరిచయం చేస్తాయి.

నాలుగు దశాబ్దాలుగా కవిగా, రచయితగా, సామాజిక తత్వవేత్తగా, నిరంతర చదువరిగా, మేధావిగా మనందరికీ చిర పరిచితుడైన పద్మారావు అన్నగారు "అన్నింటికంటే వివేచనే గొప్ప గురువంటారు" అక్షరంతో తాను చేస్తున్న అవిశ్రాంత ప్రయోగాన్ని అభివ్యక్తం చేస్తూ

**"అక్షరం ఓ విద్యుద్దీపం**
**అక్షరం ఓ పూలవనం**
**అక్షరం వెలుగుతున్న దివ్వె**
**అక్షరం హృదయ స్పందనకు సంకేతం**
**అక్షరం మేథో సంపదకు దిక్సూచి**
**అక్షరం సంపద తరగని గని"**

పొన్నూరులోని టుంబినీ వనంలో వేల పుస్తకాల మధ్య సహజీవనం చేసే అన్నగారికి అక్షరాలు తరగని సంపద. వారు సృష్టించిన అక్షరాలు కవిత్వకాంతులతో మిలమిలలాడుతూ మనకు తరగని సంపదగా నిలుస్తాయి.

పద్మారావు గారు "ఈ దేశం మాది" అన్నారు. నేను ''ఈ కవిత్వం మనది'' అంటున్నాను. కవిత్వ సంపదను సొంతం చేసుకుందాం. ఆసొంతం చదివాక ఆత్మగౌరవ స్వరంతో ఆకాశమెత్తున నినదిద్దాం. డా॥ బి.ఆర్. అంబేద్కర్ బాటలో ఆశయ సాధనకు ముందడుగు వేద్దాం! కదలండి!!



డా॥ బీరం సుందరరావు
6303443302



తొలి తెలుగు సినీ గీత రచయిత

# చందాల కేశవదాసు

ఒక గొప్ప పాట పుట్టుకకు స్వరం, గళం, కలం త్రివేణి సంగమంలా మమేకమైనప్పుడే ఆ పాట శ్రావ్యత త్రిగుణీకృతమై పదికాలాల పాటు జనం హృదయంలో వదిలంగా పాతుకుపోతుంది. ఇందులో ఏది లోపించినా ఆ పాట తాత్కాలికమే. ఇప్పుడొస్తున్న పాటలలో అధికశాతం ఇలాంటివేనని ఎవరైనా చెప్పకతప్పదు. వేల పాటలు రాసిన సుప్రసిద్ధ కవులను వేళ్ళపై లెక్కపెట్టినట్టే, అతి తక్కువ పాటలు రాసి కీర్తి శిఖరాలనందుకున్న కొద్దిమంది రచయితలను కూడా వేళ్ళమీద లెక్కించవచ్చును. అట్టివారిని ఉదహరించడా నికి తొలివరుస లో వున్నవారిని కొందరిని స్మరించుకోవడం ప్రతి తెలుగువానీ ధర్మం. **'భలే మంచి చౌక బేరము'** అన్న పాట ఇప్పటికి దాదాపు 80 ఏళ్ళుదాటినా ప్రజల హృదయాలను నేటికీ దోచుకొంటున్నది .. ఇది 1935 లో సి. పుల్లయ్య దర్శకత్వం లో నిర్మించిన **'శ్రీ కృష్ణ తులాభారం'** చిత్రం కోసం రచియింపబడినది. ఈ పాట ఏ కలం నుండి వెలువడినదో తెలుసా?... నాటక ప్రయోక్త, నటుడు , అష్టావధాని, కవి, హరికథ కళాకారుడు, అన్నిటికీ మించి తొలి తెలుగు సినీగీత రచయిత ,బహు ముఖ ప్రజ్ఞాశాలి గా ఎన్నో ప్రశంసలు అందుకొన్న **'చందాల కేశవదాసు'.** ఈ పాట విలువ తెలియజేయడానికి ఒక ఉదంతం తప్పకుండా ఇక్కడ ముచ్చటించుకోవాలి. 1935లో శ్రీకృష్ణ తులాభారం చిత్రానికి రాసిన పాట ఇది ..ఇదే పాటను ఆ తరువాత (1955 , 1966)' **శ్రీ కృష్ణ తులాభారం'** పేరుతో తీసిన రెండు చిత్రాలలోనూ ఉపయోగించుకొన్నారు అంటే ఆ సన్నివేశానికి తగిన పాట అంతకన్నా గొప్పది దొరకలేదనే కదా!. తొలి టాకీ చిత్రం **' 'ఆలం ఆరా'** 1931,లో విడుదలైంది. అదే ఏడాది హెచ్. యం.రెడ్డి నిర్మించిన తొలి తెలుగు టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' కూడా విడుదల అయింది . ఈ చిత్రం లోని పాటలు **'చందాల'** వారు రాసినవే. తద్వారా తొలి తెలుగు సినీ గేయ రచయితగా ప్రసిద్ధి పొందినారు చందాల కేశవదాసు. వీరు 1876 జూన్ 20 తేదీన ఖమ్మం జిల్లా జక్కేపల్లి లో చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు జన్మించారు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్య మిత్రత్వంతో సంగీత మూలాలు , మెలుకువలు అభ్యసించారు. 1931---1933 మధ్యకాలంలో కేశవదాసు అనేక చిత్రాలకు గీతరచనే కాక మాటలు, కథ స్క్రీన్ ప్లే రంగాల్లో కూడా రాణించారు. వీరి తొలి పాట **'భక్త పహ్లాద'** చిత్రం లో 'పరితాప భారంబు భరియింప తరమా!' అదే వీరికి తొలి తెలుగు సినీగేయ రచయిత గా ఖ్యాతిని చేకూర్చింది. వీరి విశేష కృషి ఫలితమే వీరిని శిఖరాగ్రస్థాయికి చేర్చింది. ప్రతిరోజూ కనీసం ఒక పాట, మూడు పద్యాలైనా రాయకుండా నిద్రించేవారు కాదని చెప్పేవారు వారి అనుయాయులు. చందాల వారు రచించిన ఒక గీతం **'పరాబ్రహ్మ పరమేశ్వర / పురుషోత్తమ సదానంద/ పరంజ్యోతి పరాత్పర/ పతితపావన స్వప్రకాశ/'** అన్నది ప్రార్థనా గీతమై పౌరాణిక నాటకాలకే గాక అనేక నాటకారంభాలకు నేటికీ ఆలపించే ప్రథమ గీతంగా కొనసాగుతూనే వుంది అంటే ఇది వారి ప్రతిభకు తార్కాణం కాదా! ఆ రోజుల్లో ప్రతి సినిమా విడుదలకు ఆ చిత్రంలోని పాటలను సాంకేతిక వర్గం పేర్లను నటీనటుల ముఖచిత్రంతో పుస్తకాలను కూడా విడుదల చేసి దియేటర్లలో అమ్మేవారు. ఒకసారి ఓ చిత్రానికి నటుల ఫోటోలకు బదులు పాటలపుస్తకానికి చందాల కేశవదాసు గారి ఫొటోను ముఖచిత్రంగా వేశారు. ఈ గౌరవం ఇప్పటివరకు ఏ రచయిత కూ దక్కలేదు. వారికి అనేక సందర్భాల్లో జరిగిన సన్మానాలలో బహూకరించిన స్వర్ణ కంకణాలు, కనకాభిషేకా ల్లో వచ్చిన విలువైన వస్తువులను అమ్మివేసి ఆ ధనంతో దాన ధర్మాలు, సత్కార్యాలు చేసేవారట. ఇది వారి మానవత్వపు కోణం. 1946లో దొడ్డి కొమరయ్య హత్యానంతరం రజాకార్లు పెట్రేగిన తరుణంలో ' చందాల కేశవదాసు నిరసన సాహిత్యం దావానలమై దుండగులను భయభ్రాంతులను చేసింది. ఈ కారణంగా రజాకార్లు జక్కేపల్లి లోని తన ఇంటిని దోపిడీ చేయగా ఖమ్మం పట్టణానికి మకాం మార్చారు. వీరికి దక్కిన అనేక బిరుదులలో అరుదైనది **'తెలంగాణ హరికథా పితామహుడు'.** పాటకు, సాహిత్యానికి, మానవత్వానికి కళలకూ ప్రాణం పోసిన కవివరేణ్యులు **'చందాల కేశవదాసు':** 1956 వ సంవత్సరం మే నెల 14 వ తేదీ నాడు ధ్యాన ముద్రలో నిమగ్నమై పరమపదించారు. పాటకు ఆయువు పెంచిన వీరిని స్మరించు కోవడమే గాక అనుసరించడం నేటితరం యువ కవుల కర్తవ్యం.

నేటి మేటి పాట



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## నానీలు

పేదరికమే
గొప్ప చిత్రకారిణి
అమ్మ చీరపై
చిరుగుల చిత్రాలు.

మనసులో
బాధల అల్పపీడనం
జీవితానికి
తుఫాను హెచ్చరిక

అంతర్జాలంలో
అన్నీ అమ్మకానికే
అమ్మప్రేమకు
నో స్టాక్ బోర్డు.

ఆమె ముఖంలో
అందమైన నవ్వు
అది హృదయం లోని
వెన్నెల పువ్వు.

పసమ్మాయిది
అభయ హస్తం
ఇంట్లో ప్రతి మూల
తనకోసమే తపిస్తూ!



-ఎన్. లహరి
9885535506

# వీరే అర్హులు




కౌసల్య దేశాన్ని పరిపాలించే మహారాజు ధర్మదత్తుడు. తాను తన పేరుకు తగ్గట్టుగానే నీతిమంతుడు. దేశ ప్రజలను తన కన్న బిడ్డలవలె చూసుకునేవాడు.

తన దేశం పాడి పంటలతో నిండుగా ఉండేడిది. ప్రజలందరూ మూడుం గాలాలు సంబరాలలో జీవిస్తున్నారు.

ఇలాపాలిస్తున్న మహారాజు వయోభారంతో తన పాలనకు తగు న్యాయం చేయలేక పోతున్నానని మదన పడసాగాడు. నా తదనంతరం రాజ్య సింహాసనమును దక్షుడైన వాడికే అప్పగించాలని నిశ్చయించుకొన్నాడు.

ఈ విషయమై తన సలహా దారులతో సమగ్ర ఆలోచన చేశాడు. వారందరూ "మహా ప్రభూ! యువరాజు మీ జేష్ఠ పుత్రరత్నం ఉండగా మరో ఆలోచన ఎలా?".... అని చెప్పారు. "ఆ రాకుమారుడు మన విద్యానందస్వామి గురుకుల ఆశ్రమంలో విద్యా శిక్షణ పొందుతున్నారు. వారి విద్యాభ్యాసం ఈ యేడు అయిపోవచ్చింది. పైగా ఆజానుభాహుడు, ఆశ్రమంలో అన్నింటాతానే మేటి, సుగుణమంతుడు కూడా. అంతటి ధీశాలి.." అని చెప్పారు.

"అవి అన్నీ వాస్తవమే కావచ్చు కాని నిస్వార్థంతో ప్రజల సమక్షంలో నా దేశ ప్రజలకు ఉపయుక్తమగు యువ రాజునే ఎన్నుకోవాలనే నిర్ణయానికి వచ్చాను. మనం విద్యానంద స్వామి ఆశ్రమానికి బయలు దేరాలి. ప్రయాణం సిద్ధం చేయండి" అని ఆజ్ఞాపించాడు.

×××

రాజుగారి రాక తెలిసిన స్వామీజీ తగు మర్యాదలతో తన ఆశ్రమానికి స్వాగతం పలికారు.

ఉచితాసీనులైన మహారాజు కుశల ప్రశ్నలయ్యాక "స్వామీజీ! నేను మీ ఆశ్రమానికి ఎందుకు వచ్చానో తెల్సా..?' అని అడిగాడు.

"మహారాజులు నేనెలా అడుగ గలను. రాజ్యమంతా మీదే ఈ రాజ్యంలోని ప్రతి అంగుళం మీద మీకు సర్వ హక్కులున్నవి. మీ రాకతో మాకందరికీ మహానందం. ఏమిటో సెల్విబ్వండి రాజా!" అన్నాడు.

"స్వామీజీ! మాకో ధర్మ సందేహం వచ్చిపడింది.."

"అదేమిటో.. సెలవివ్వండి రాజా!"

"మన రాజ్యానికి భవిష్యత్తులో కాబోయే మంచి దక్షత కలిగిన యువరాజును కోరి వచ్చాను.."

"అదేంటి? మహారాజా! మీ పుత్రులు విద్యాదత్తుడు, వినయదత్తు.." స్వామి మాటలు పూర్తికాక ముందే..

"స్వామీజీ! ఆ విషయం నాకూ తెల్సు కాని.."

"అంటే.." అనుమానంగా అడిగాడు స్వామీజీ..

"ఏం లేదు. ఈ దేశానికి రాబోయే రాజు సమర్థుడై.. నా దేశ ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకునేవాడై మంచి దక్షుడై ఉండాలి. అలాంటి వారు మీ ఆశ్రమంలో ఉంటారన్న ధీమాతో వచ్చాను.."

"అలాగే మహారాజా.. నిన్ననే నా ఆశ్రమంలోని కొందరికి నేనొక పరీక్ష పెట్టా అందులో పది మంది విద్యార్థులు మెరికల్లా ఉన్నారు. వారిలో మీకెవరు నచ్చితే వారిని..."

"అలా కాదు. నా మరియు, నా పుర ప్రముఖుల సమక్షంలోనే పరీక్షించి, మీరే ఎన్నుకొని ఇవ్వాలి.."

"అలా అయితే ఒక వారం సమయం కావాలి మహారాజా..!" అని విన్నవించుకున్నాడు స్వామీజీ.

"సరే మాకు సమ్మతమే ఇక మాకు సెలవా?.. " అని చెప్పి రాజుగారు వెళ్లిపోయారు.

రాజుగారు వెళ్లిపోగానే ఆరోజు రాత్రంతా తెగ ఆలోచించి స్వామీజీ ఒక కొత్త పరీక్షను సిద్ధం చేశాడు. మహారాజుకు ఇచ్చిన మాట ప్రకారం ఆ వారం రానే వచ్చింది. మహారాజుగారిని ఆశ్రమానికి రమ్మన్న వార్తను వేగుల ద్వారా చేరవేశాడు స్వామీజీ.

కబురు అందినంతనే రాజుగారు ఆశ్రమానికి తన మత్రి గణంతో పాటు, కుటుంబ సమేతంగా పురజనులు కూడా వచ్చేశారు. వచ్చిన వారందరికీ ఉచితాసనాలు ఏర్పాటు చేశారు. స్వామిజీ స్వాగతం పలికిన తర్వాత, పరీక్షలో పాల్గొనే మెరికల్లాంటి యువ శిష్యులను రప్పించి, మహారాజుగారికి వారి పరిచయాలు చేశారు.

తన శిష్యులను ఉద్దేశించి "నా ప్రియమైన శిష్యులారా! ఇదిగో ఇదొక చీమ్మచీకటి సొరంగం. ఇందులో నుండి ఎవరు ముందు బయటికి వస్తారో వారే విజేతలు. ఆ విజేతనే రేపు మన దేశ యువరాజు కాగలుగుతారు. అయితే ఈ సొరంగంలో రాళ్ళు రప్పలు, ఎత్తు పల్లాలు కూడాఉంటాయి. వీటన్నింటినీ అధిగమించి బయటకు రావలసి ఉంటుంది..." అని చెప్తూ రాజువైపు చూశాడు స్వామీజీ "నేను చెప్పింది వాస్తవమే కదా!" అన్నట్టు.

ఇది గమనించిన మహారాజు "అవును" అన్నట్టు తల ఊపుతూ "ఈ పందెంలో గెలుపొందిన వారే రేపు మన కౌసల్య దేశపు రాజు" అని మరొకసారి అందరి ముందు ప్రకటించారు రాజుగారు.

అక్కడి ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన వారంతా కరతాళ ధ్వనులతో రాజుగారి ప్రకటనను స్వాగతించారు.

స్వామీజీ తన శిష్యులతో "నా ప్రియ చిరంజీవులారా! నేను చెప్పిన విషయాలు పూర్తిగా అవగతమైనవనుకుంటాను.." అని వారందరినీ సొరంగంవైపు తీసుకెళ్ళాడు.

పోటీలో ఉన్న పది మంది యువకులు అక్కడి గీసిన గీత మీద పరుగుకు సిద్ధంగా నిలబడగానే "మీరంతా ఇక సిద్ధమే కదా!" అని మరొక మారు ప్రకటిస్తూ పరుగుకు సూచికగా గంట మోగించారు.

గంట మోగిన మరుక్షణమే వారంతా సొరంగంలోకి వెళ్లిపోయారు.

మరో పది నిమిషాల్లోనే ఆ సొరంగం నుండి కొందరు మొదటే బయటికి వచ్చేశారు. ఆ తర్వాత కొందరు, మిగతా వారు చివర్లో వచ్చారు. వారందరినీ వరుసగా నిలబెట్టాడు స్వామీజీ.

ముందుగా ప్రథమ స్థానంలో వచ్చిన వారిని అడిగాడు స్వామీజీ "చిరంజీవులారా! మీ అనుభవం చెప్పండి.." అని దానికి వారు ఇలా చెప్పసాగారు. "గురువుగారు నమస్కారం, మేము ఇతరుల సాధక బాధకాలను వినిపించుకోకుండా వచ్చేశాము" అని.

అలాగే చివర్లో వచ్చిన వారిని అడిగితే "మాకు అడ్డు వచ్చిన వారినల్లా తోసేసి వచ్చాము" అని

అలాగే చివర్లో వచ్చిన వారిని అడిగితే "మేము ఇతరులకు ఏ కష్టమ బాధా కలుగకుండా తోవలో ఉన్న రాళ్ళూ రప్పలు అన్నీ ఏరుకుంటూ ఆ రాళ్ళను మాజేబుల్లో వేసుకుంటూ వచ్చాము" అని చెప్పారు.

వారివారి అనుభవాలను విన్న తర్వాత స్వామీజీ మహారాజుతో ఇలా చెప్పారు "మహారాజా! మొదట వచ్చిన వారే ఈలోకం దృష్టిలో విజేతలు కావచ్చు కానీ, వారు స్వార్థపరులు, ఇతరులతో మాకేం సంబంధం లేనట్టు వచ్చేశారు. ఇది రాజుకుండాల్సిన లక్షణం కాదు, కావున వారు అర్హులు కాదు ఇక రెండో స్థానంలో వచ్చిన వారు అడ్డమొచ్చిన వారినల్లా నిర్దాక్షిణ్యంగా తోసేస్తూ తమ గెల్పే ముఖ్యమని వచ్చేశారు. వీరు పూర్తిగా స్వార్థపరులు. ఇలాంటి స్వార్థపూరిత గుణమున్న వారు పాలకులుగా అసలు పనికి రారు మహారాజా! అయితే చివరి స్థానంలో ఉన్నవారు నిస్వార్థపరులు. పైగా పరుల యోగాక్షేమాలే తమ క్షేమమని భావించిన వారు ఎందుకంటే తమకన్నా ఇతరుల యోగక్షేమాలే ముఖ్యమని భావించి, నడవడానికి పరుగెత్తడానికి అడ్డు పడుతున్న రాళ్లను ఏరుతూ వచ్చారు. వాళ్లకు వారి జెబుల్లోనుంచి తీసి చూసేంత వరకూ అవి రత్నాలని తెలవదు. ఇలా నిస్వార్థంగా పరుల యోగాక్షేమాలు కోరుకునే వారే అసలు సిసలైన పాలనాదక్షులు మహారాజా!" అలా స్వామీజీ చెప్పగానే వచ్చిన పుర ప్రజలు చప్పట్లతో సందడి చేశారు. కారణం అందులో ఇద్దరు రాజకుమారులున్నారు. జనం వారి మనోభవిష్ట ప్రకారమే జరిగిందని కాబోలు.

కానీ ఆ మూడవ స్థానంలో ముగ్గురున్నారు. "ఇందులో ఎవరిని రాజ కుమారునిగా ప్రకటించాలో మహారాజా! మీరే..." స్వామీ మాట పూర్తవ్వకమునుపే

"స్వామీజీ! ఆ తుదినిర్ణయం కూడా మీరే చేయండి" అని రాజుగారు ఆజ్ఞాపించారు.

"రాజా! ఈ ముగ్గురూ కొన్ని రాళ్లు ఏరుకొని తెచ్చామన్నారుగా, వారి జేబుల్లోని రాళ్ళను పరీక్షిద్దాం. అపుడు గాని ఎవరు యోగ్యులో చెప్పలేను" అనగానే..

రాజు "సరే మీ అభీష్టం మేరకే కానీయండి" అని చెప్పారు.

అలాగే ఆ ముగ్గురు తాము ఏరి జేబులో వేసుకున్న రాళ్ళను తీయసాగారు. అవివట్టి రాళ్లు కావు రత్నాలు. వాటిని చూసి ఆశ్చర్యపోయారు ఆ యువకులు, ముగ్గురూ తమ జేబుల్లో నుండి తీసి దోసిట్లలో పట్టుకుని నిలబడ్డారు వినయంగా. స్వామీజీ వారి దగ్గరికెళ్లి లెక్కించగా ముగ్గురి దగ్గరున్న రాళ్ళు ఒకే లెక్కన లేవు. అందులో ఒకరి దగ్గర అందరి కన్నా, ఎక్కువున్నాయి. అలాఉన్నవాడి చెయ్యినిపైకి ఎత్తుతూ "ఇదిగో ఈ కుర్రాడే రేపు మన దేశానికి కాబోయే రాజు" అనగానే పుర ప్రజలందరూ తమ కరతాళ ధ్వనులతో సంబరపడిపోయారు. అతనెవరో కాదు రాజుగారి జేష్ఠ పుత్రుడు విద్యాదత్తుడే

అది గమనించిన రాజుగారు పరమానంద భరితుడై "స్వామీజీ! అలాగే మంత్రిని సేనాధిపతినీ కూడా..." రాజుగారి మాటలు పూర్తికాక ముందే "అలాగే మహారాజా!' అని అంటూ రెండో అధిక రాళ్లు కలిగున్న అతని చూసే సరికి అతను ఓ మామూలు పౌరుని కుమారుడు "ఇదిగో ఈ లక్ష్మణుడే మన దేశ ప్రధాన మంత్రి" అతని చెయ్యెత్తి చూయించాడు. అక్కడున్న వారంతా రాజు యొక్క ఔదార్యానికి జేజేలు పలికారు. ఇక మిగిలింది మహారాజు వారి కనిష్ఠ పుత్రుడు వినయ దత్తుడు తనను సర్వ సేనాధిపతిగా ప్రకటించేశాడు స్వామీజీ.

స్వామీజీ నిర్వహించిన ఈ మహా క్రతువుకు మహారాజుతో బాటు దేశ ప్రజలందరూ ఆనందోత్సవాలతో జేజేలు పలికారు.

స్వామీజీ కుశలత్వానికి మెచ్చి ఆ గురుకుల ఆశ్రమానికి మరెన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్టు ప్రకటిస్తూ స్వామీజీకి ప్రణామములు చేసి వెళ్లిపోయారు మహారాజులవారు.

నీతి: ప్రజలు మెచ్చిన దక్షుడైన వ్యక్తే రాజ్యపాలనకు అర్హుడని, నిస్వార్థంగా ప్రకటించిన రాజు గొప్పవాడని పించుకున్నాడు.



-దారం గంగాధర్
సెల్:9848384777

## మృత్యు శకటం

ధాన్యపు గింజ–
అన్నమై ఆహారమవుతుంటే
కొండొకచో–
పై పొట్టు ప్రాణాలు హరిస్తుంది!
ఊకతో కొవ్వెక్కిన వాహనం
ఊరేగుతున్న మృత్యు శకటం!
బరువు లేకున్నా బలుపులాంటి
తోలుతిత్తులతో తోలేవాడు
గ్రుడ్డి యముడైపోతాడు!
ఉఫ్ అంటే ఎగిరే పొట్టు
మనిషి ఉసురును ఊదేస్తుంది!
పరిమితుల్లో ఇమిడే ప్రయాణం
ప్రాణహాని లేనిదౌతుంది!
ఎక్కడ ఆలోచనలు బందీనో
అక్కడ ఆశలు రెక్కల బెలూన్లవుతాయి!
ఊకలో నిద్రిస్తు చట్టాన్ని
ఊరక ఉంచేక తట్టి మేల్కొల్పాలి!!

-కావూరి శారద
సెల్: 7780357378

## అనురాగాల రంగేళి!

*

కమనీయపుష్పరసాలుండగా
కల్మషాల రంగులెందుకు?
పరిమళించే ఓషధులుండగా
పనికిమాలిన వాసనలెందుకు?
పరులపై బురదలు చల్లకు
హృదయాలు కల్మషమౌతాయి
పరిమళించే భావాలను పంచు
పరవశించే అనుభూతులను ఉంచు
నిరంతరస్నేహభావనలతో
చిరంతనప్రేమాభిమానాలు పెంచు!



డా॥ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.

## మహిళ

ఆర్ధ్రినీ, ఆలంబననూ
అమ్మలో ఆవిష్కరిస్తూ
ఒద్దికనూ, ఓదార్పునూ
ఆలిలో అనుగ్రహిస్తూ
"'మహిని"తనలో నింపుకుంది
మహిళ మహిమాన్వితురాలయ్యింది సబల.
అవని గర్భాన్ని చీల్చుకొని
అంతరిక్షాన్ని ఛేదించుకోని
సంకల్పాన్నిసాధించింది,
సత్యాన్ని శోధించింది
నిన్నటి రాతల్ని మార్చే పథంలో
నేటి పోకడలను వెలివేసే కథనంలో
సజీవ భావమై నిలిచింది
సంస్కార రూపమై గెలిచింది
బంధాల, బాధ్యతలను తెలిపి
బ్రతుకు మలుపులని చవి చూపి
చరిత్రలో చెక్కిన శిల్పమై
దరిత్రిలో చెరగని కల్పమై
తరాల అంతరాలు స్పృశించింది
సమయాన సమరాన్ని చాటింది
ధీర వనితగా, శాంత చిత్తంగా మురిపించింది
మొల్లగా, వల్లిగా,జల్లులు కురిపించింది
ఆమె ఒక స్ఫూర్తి
కమనీయపు కావ్య చిత్రం
ఆమె ఒక మూర్తి
కదలని కాలానికి చైత్రం



-డా॥సముద్రాల శ్రీదేవి
9949837743

